epaper.samayamdaily.net APTEL/2006/18267
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక · తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.
7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 182 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 10 మే 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

# సంజయ్‌కు సన్‌స్ట్రోక్!

కేంద్ర మంత్రి కుమారుడిపై పోక్సో కేసు

వివరాలు 2వ పేజీలో

- సాయి భగీరథ్‌పై బాలికపై లైంగిక దాడి ఆరోపణలు
- పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- రాష్ట్ర రాజకీయాల్లో దుమారం
- మోదీ పర్యటన వేళ కేంద్ర మంత్రికి కొత్త చిక్కులు
- 5 కోట్లు డిమాండ్ చేశారంటూ కరీంనగర్‌లో భగీరథ్ కంప్లైంట్
- గతంలోనూ ర్యాగింగ్ కేసు.. ఇప్పుడు పోక్సో..
- సోషల్ మీడియాలో పదవికి రాజీనామా డిమాండ్



## పలువురు ఐఏఎస్‌ల బదిలీలు




వివరాలు 5వ పేజీలో

# సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్



### పట్టణ జనాభాకు అనుగుణంగా వసతులు
### రోడ్ల విస్తరణతో పాటు మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్
### పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సీఎం రేవంత్

మూడు అంచెల రవాణా వ్యవస్థ..

మల్టీ లెవెల్ పార్కింగ్

**హైదరాబాద్, మే 9:** ఆధునీకరణ, పట్టణీకరణతో భవిష్యత్తులో మరిన్ని కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ అనే త్రీ లెవెల్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించు కున్నామని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణకు కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే సరిపోదని.. మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీఎం వెల్లడించారు. పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని మూడు భాగాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ప్యూర్,క్యూర్, రేర్ అభివృద్ధిని మూడు భాగాలుగా విభజించుకున్నామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు ఏరియాను సర్వీస్ సెక్టార్‌గా గుర్తించా మన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు బయట, రీజనల్ రింగ్ రోడ్డు లోపల

మిగతా 2 లో

# నేడు నగరానికి నమో

### ప్రధాని హైదరాబాద్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
### పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ
### సికింద్రాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు.. మూడంచెల భద్రత






భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం భాగ్యనగర పర్యటనకు రానున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగిస్తారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో అటు పోలీసులు.. ఇటు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఆదివారం మధ్యాహ్నం 2:50 గంటలకు ప్రత్యేక విమానంలో మోదీ బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుండి నేరుగా సభ జరిగే పరేడ్ గ్రౌండ్స్‌కు బయలుదేరుతారు.

2



## అమెరికా- ఇరాన్ మధ్య మరోసారి చర్చలు

- రంగంలోకి 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్ ప్లస్'
- యూఎన్ చీఫ్‌కు ఇరాన్ లేఖ
- ఉల్లంఘనలపై సయీద్ హెచ్చరిక!

4

# 11 నుండి విద్యా వారోత్సవాలు



- 'ప్రజా పాలన'లో భాగంగా ప్రభుత్వం నిర్ణయం
- ఎల్బీ స్టేడియంలో భారీ ప్రారంభోత్సవం
- జిల్లా కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి విద్యాశాఖ వారోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు అధికారులను ఆదేశించారు. విద్యా వారోత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై శనివారం ఆయన సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 11న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుండి విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరయ్యేలా కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.

2

## డిప్యూటీ సీఎం పవన్ చొరవ



వివరాలు 5వ పేజీలో

## విజయ్‌కు లైన్ క్లియర్

మద్దతు లేఖ అందజేసిన వీసీకే



4

# కరీంనగర్ బంద్ సంపూర్ణం

- బీఆర్ఎస్ పిలుపునకు వ్యాపారుల స్వచ్ఛంద మద్దతు
- ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అరెస్ట్

2



# కాళేశ్వరం ప్రాజెక్టును తక్కువ చేసే యత్నం



- అధికారంలో ఉండగా ప్రాణహిత కోసం చేసిందేమీ లేదు
- కేసీఆర్ ముందుచూపుతోనే కాళేశ్వరం నిర్మాణం
- బీఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు

కటిక చీకట్లోనూ కారుదీపం లాంటిది కాళేశ్వరం అని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ ముందుచూపుతో ఆలోచించి కాళేశ్వరం నిర్మాణం చేపట్టారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును తక్కువ చేసి మాట్లాడితే తెలంగాణకు ద్రోహం చేసినట్లే అవుతుందని అన్నారు.

2

# సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్

మొదటి పేజీ తరువాయి

ఉన్న ఏరియాను మాన్యూఫ్యాక్చర్ సెక్టార్‌గా గుర్తించామని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు బయట ఉన్న ఏరియాను అగ్రికల్చర్ సెక్టార్‌గా గుర్తించామని అన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి సంబంధించి తెలంగాణ రైజింగ్-2047 మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించుకున్నామని ముఖ్యమంత్రి అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు మన సంస్కృతికి అనుసంధానం చేయబోతున్నట్లు తెలిపారు. నగరంలో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఆర్టీసీలో ఈవీ బస్సులను తీసుకొస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి ఈవీ వాహనాలుగా మార్చబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆధునికీకరణ, పట్టణీకరణతో భవిష్యత్‌లో మరిన్ని కొత్త సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిటీ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాలపై సమావేశంలో చర్చించారు.




## కరీంనగర్ బంద్ సంపూర్ణం

- బీఆర్ఎస్ పిలుపునకు వ్యాపారుల స్వచ్ఛంద మద్దతు
- ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అరెస్ట్

**కరీంనగర్, మే 9:** ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై బీజేపీ శ్రేణుల దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ ఇచ్చిన బంద్ పిలుపు కరీంనగర్ నగరంలో విజయవంతంగా కొనసాగుతోంది. నగరంలోని వ్యాపార, వాణిజ్య సముదాయాలు స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు తెలిపి షాపులు మూసివేశారు. బంద్ నేపథ్యంలో రోడ్లపైకి వచ్చిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడే అరెస్టు చేసి టీటీసీకి తరలించారు. శనివారం ఉదయం నుంచే గంగుల కమలాకర్ ఇంటి వద్ద మోహరించిన పోలీసులు ఆయనను అరెస్టు చేసి ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాజీ మేయర్ రవీందర్ సింగ్, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు గంగాధర మండలం బూరుగుపల్లి నుంచి బంద్‌లో పాల్గొనేందుకు బయలుదేరిన చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. ఆయనను అదుపులోకి తీసుకుని బూరుగుపల్లిలోని నివాసానికి తరలించి హౌస్ అరెస్టు చేశారు. ప్రస్తుతం కరీంనగర్ లో బంద్ ప్రశాంతంగా సాగుతోంది. నగరంలోని అనేక ప్రాంతాల్లో వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. పోలీసులు నిరసనకారులు రోడ్లపైకి రాకుండా ఎక్కడికక్కడే అరెస్టులు కొనసాగిస్తున్నారు.






## భాగ్యనగరానికి ప్రధాని మోదీ రాక

### పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ

**సికింద్రాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు.. మూడంచెల భద్రత**

**హైదరాబాద్, మే 9:** భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం భాగ్యనగర పర్యటనకు రానున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగిస్తారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో అటు పోలీసులు.. ఇటు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఆదివారం మధ్యాహ్నం 2:50 గంటలకు ప్రత్యేక విమానంలో మోదీ బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుండి నేరుగా సభ జరిగే పరేడ్ గ్రౌండ్స్‌కు బయలుదేరుతారు. ప్రధాని పర్యటనను దృష్టిలో ఉంచుకుని పోలీసులు భద్రతను ఏర్పాటు చేశారు. పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో మూడం చెల భద్రతా వలయాన్ని నిర్మించారు. సుమారు 2,000 మందికి పైగా పోలీసులతో పాటు ప్రత్యేక రక్షణ బృందాలు.. స్నైపర్లు.. మఫ్టీ పోలీసులు.. క్విక్ రెస్పాన్స్ టీమ్స్ రంగంలోకి దిగాయి. ప్రధాని పర్యటన.. బహిరంగ సభ కారణంగా సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఈ ఆంక్షలు అమ లులో ఉంటాయి. ముఖ్యంగా బేగంపేట విమానాశ్రయం నుండి పరేడ్ గ్రౌండ్స్ వరకు వెళ్లే ప్రధాన రహదారులతో పాటు సికింద్రాబాద్ పరిసరాల్లో వాహనాల రాకపోకలను నియంత్రిస్తారు.

## సంజయ్‌కు సన్‌స్ట్రోక్!

- సాయి భగీరథ్‌పై బాలికపై లైంగిక దాడి ఆరోపణలు
- పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- రాష్ట్ర రాజకీయాల్లో దుమారం
- మోదీ పర్యటన వేళ కేంద్ర మంత్రికి కొత్త చిక్కులు
- 5 కోట్లు డిమాండ్ చేశారంటూ కరీంనగర్‌లో భగీరథ్ కంప్లైంట్
- గతంలోనూ ర్యాగింగ్ కేసు.. ఇప్పుడు పోక్సో..
- సోషల్ మీడియాలో పదవికి రాజీనామా డిమాండ్

**హైదరాబాద్, మే 9:** నేడు ప్రధాన రాష్ట్ర పర్యట వేళ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కు కొడుకుతో తలనొప్పి మొదలయింది. తన కుమారుడు బండి సాయి భగీరథ్ చుట్టూ రాజకీయ సెగలు ముసురుకుంటున్నాయి. మైనర్ బాలికను లైంగికంగా వేధించాడన్న ఆరోపణలతో ఆయనపై హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదవ్వడం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. గతంలో యూనివర్సిటీలో తోటి విద్యార్థిపై దాడి చేసిన కేసులో నిందితుడిగా ఉన్న భగీరథ్, ఇప్పుడు అంతకంటే తీవ్రమైన లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కోవడం గమనార్హం. ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటనకు వస్తున్న సమయంలో ఈ ఉదంతం వెలుగులోకి రావడం బీజేపీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

### పేట్ బషీరాబాద్‌లో నమోదైన పోక్సో కేసు

బాధితురాలి తల్లిదండ్రులు మేడ్చల్ జిల్లాలోని పేట్ బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించి సంచలన ఆరోపణలు చేశారు. తమ మైనర్ కూతురిని (17 ఏళ్లు) మొయినాబాద్‌లోని ఒక ఫామ్ హౌస్‌కు మరియు మరో రెండు ప్రాంతాలకు తీసుకెళ్లి, అక్కడ ఆమెకు మద్యం తాగించి లైంగిక దాడికి పాల్పడ్డాడని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వేధింపుల కారణంగా తమ కుమార్తె తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి కూడా పాల్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు మొదట కేసు నమోదులో తాత్సారం చేసినా, బాధితులు కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించడంతో బీఎన్ఎస్ 74, 75 సెక్షన్లతో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 11, 12 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.



### హనీట్రాప్ అంటూ భగీరథ్ ఎదురు దాడి

అయితే, తనపై వచ్చిన ఆరోపణలను సాయి భగీరథ్ పూర్తిగా ఖండించారు. పేట్ బషీరాబాద్‌లో కేసు నమోదు కావడానికి ముందే ఆయన కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో తనపై హనీట్రాప్ కుట్ర జరుగుతోందని ఫిర్యాదు చేశారు. ఆ అమ్మాయి తనకు ఒక కామన్ ఫ్రెండ్ ద్వారా పరిచయమైందని, తామిద్దరం కలిసి విజయవాడ, అరుణాచలం వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలకు వెళ్లామని ఆయన పేర్కొన్నారు. కొంతకాలం తర్వాత ఆ అమ్మాయిని వివాహం చేసుకోవాలని ఆమె తల్లిదండ్రులు తనపై ఒత్తిడి తెచ్చారని, అందుకు నిరాకరించడంతో రూ. 5 కోట్లు డిమాండ్ చేస్తూ బ్లాక్ మెయిల్ చేశారని భగీరథ్ ఫిర్యాదులో తెలిపారు. గతంలో భయపడి ఆ అమ్మాయి తండ్రికి రూ. 50 వేలు చెల్లించానని, కానీ ఇప్పుడు భారీ మొత్తం కోసం తనపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆయన వాదించారు.

### నేడు ప్రధాని మోదీ పర్యటన వేళ..

ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు విచ్చేస్తున్న తరుణంలో, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు కావడం రాజకీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలతో పాటు, ఈ వ్యవహారంలో హనీట్రాప్, రూ. 5 కోట్ల బ్లాక్‌మెయిల్ కోణాలు వెలుగులోకి రావడం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గతంలోనూ సాయి భగీరథ్ ర్యాగింగ్ కేసుల్లో చిక్కుకోవడం, ఇప్పుడు ఏకంగా పోక్సో వంటి తీవ్రమైన కేసు నమోదు కావడంతో ప్రధాని పర్యటన వేళ బండి సంజయ్‌కు ఇది పెద్ద తలనొప్పిగా మారింది.

### పరువు పోతుందనే ఆందోళనలో బండి

ఈ ఉదంతం ఇప్పటికే ఢిల్లీలోని బీజేపీ అధిష్టానం దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కీలక బాధ్యతల్లో ఉన్న బండి సంజయ్, తన సొంత కుమారుడిపైనే ఇటువంటి నేరారోపణలు రావడంతో అధిష్టానం పెద్దల వద్ద పరువు పోతుందనే ఆందోళనలో ఉన్నట్లు సమాచారం. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే ఈ పరిణామాలపై కేంద్ర పెద్దలు సీరియస్‌గా ఉన్నారని, దీనిపై పూర్తి స్థాయి నివేదికను కోరినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### కేంద్ర మంత్రి పదవికి రాజీనామా డిమాండ్

ఈ ఉదంతం రాజకీయంగా పెద్ద దుమారం రేపుతోంది.



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉంటూ శాంతిభద్రతలను పర్యవేక్షించాల్సిన బండి సంజయ్, నేరచరిత్ర కలిగిన తన కుమారుడిని ఇంట్లో పెట్టుకోవడం ఏంటని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. సోషల్ మీడియాలో బండి సంజయ్‌ను తక్షణమే పదవి నుండి తప్పించాలనే డిమాండ్ ఊపందుకుంది. గతంలో ర్యాగింగ్ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి కేంద్ర మంత్రి హోదాలో ఉన్న తండ్రి అండగా నిలుస్తున్నారని, ఇప్పుడు కూడా బాధితులపైనే ఎదురు కేసులు పెట్టించడం ద్వారా అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### పోలీసుల విచారణలో కీలక అంశాలు

ప్రస్తుతం ఈ కేసులో పోలీసులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. బాధితురాలి వాంగ్మూలాన్ని రికార్డ్ చేయడంతో పాటు, ఘటనా స్థలాల్లో లభించే ఆధారాలు, కాల్ డేటా మరియు ఇతర డిజిటల్ ఆధారాలను సేకరిస్తున్నారు. మరోవైపు కరీంనగర్ పోలీసులు భగీరథ్ ఫిర్యాదు మేరకు ఆ యువతి మరియు ఆమె తల్లిదండ్రులపై బిఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. రెండు వైపులా భిన్నమైన వాదనలు వినిపిస్తుండటంతో, అసలు ఇది పథకం ప్రకారం జరిగిన 'హనీట్రాప్' లేక ఒక మైనర్ బాలికపై జరిగిన దారుణమా? అనేది విచారణలో తేలాల్సి ఉంది.



## భూముల ధరల పెంపు నిర్ణయం

### రిజిస్ట్రేషన్లకు భారీగా డిమాండ్

**హైదరాబాద్, మే 9:** భూముల ధరల సవరణ నిర్ణయంతో తెలంగాణలో రిజిస్ట్రేషన్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. స్థిరాస్తుల మార్కెట్ విలువ పెంచేందుకు కసరత్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విలువలు పెరగకముందే రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ప్రజలు చొరవ చూపుతున్నారు. ఈ నెల 12 నుంచి 15 వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అదనంగా పని చేయనున్నాయి. ఆయా రోజుల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు పనివేళలుగా ప్రభుత్వం నిర్ణయించింది. రిజిస్ట్రేషన్లకు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్బీ నగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ ఆర్వో, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్ కార్యాలయాల్లో అదనపు పనివేళలు ఉంటాయని ప్రభుత్వం తెలిపింది. అవసరమైతే మరింత సమయం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొంది. స్లాట్ బుకింగ్‌ల సంఖ్య పెంచాలని అధికారులను ఆదేశించింది.

## లేగదూడను రక్షించబోయి..

### బావిలో పడిప్రాణాలు కోల్పోయిన తండ్రీ కొడుకులు



**ములుగు, మే 9 :** ప్రమాదవశాత్తు బావిలో పడ్డ లేగదూడను రక్షించే క్రమంలో తండ్రీ కొడుకులిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకర ఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం కర్లపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. తండ్రీకొడుకులైన రస్పుత్ రాజు, పవన్‌లు కర్లపల్లి గ్రామంలోని సుమారు 35 అడుగుల లోతైన బావిలో లేగదూడ పడిపోవడంతో దానిని కాపాడేందుకు ఆ బావిలోకి దిగారు. అయితే ఇద్దరూ ఒకే తాడుతో బావిలోకి దిగే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తాడు ఒక్కసారిగా తెగిపోవడంతో ఇద్దరు బావిలో పడిపోయి నీటిలో చిక్కుకున్నారు. గోవిందరావుపేట సీఐ దయాకర్, ఎస్సై తాజుద్దీనులు ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రస్పుత్ రాజు మృతదేహాన్ని బయటకు తీశారు. పవన్ మృతదేహం కోసం గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు కొనసాగిస్తున్నారు. తండ్రీకొడుకులు గొప్ప మనసుతో ఓ మూగజీవిని రక్షించాలనుకుని ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## అమెరికాలో స్విమ్మింగ్ పూల్‌లో మునిగి హైదరాబాద్ యువతి మృతి

### కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు



**హైదరాబాద్, మే 9:** అమెరికాలో స్విమ్మింగ్ పూల్‌లో మునిగి ఓ తెలుగు యువతి ప్రాణాలు కోల్పోయిన ఘటన తీవ్ర విషాదం రేపింది. వర్జీనియాలో నివాసముంటున్న వీణ అనే యువతి మరణంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. రెండు రోజుల క్రితం ఓ ఫంక్షన్‌లో పాల్గొనేందుకు ఫ్లోరిడా వెళ్లిన ఆమె.. అక్కడే స్విమ్మింగ్ పూల్ వద్ద జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. వీణ తల్లిదండ్రులు దేవేందర్ రెడ్డి-సునీత ఎల్‌బినగర్ నియోజకవర్గ పరిధి లింగోజిగూడ డివిజన్‌లో నివాసం ఉంటున్నారు. ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకున్న తమ కుమార్తె మరణ వార్తతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ విషాదం గురించి తెలుసుకున్న ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నేరుగా వీణ తల్లిదండ్రులు ఉంటున్న నివాసానికి వెళ్లారు. వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వీణ భౌతిక కాయాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తీసుకొచ్చేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఆ కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు.

## కారులో గ్యాస్ నింపుతుండగా మంటలు

### పేలుడు ధాటికి రెండుకార్లు, టూవీలర్ దగ్ధం

**కామారెడ్డి, మే 9:** కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో ఓ కారులో గ్యాస్ నింపుతుండగా ఒక్కసారిగా ట్యాంకు పేలింది. ఈ ప్రమాదంలో కారు పక్కన పార్కింగ్ చేసి ఉన్న మరో రెండు కార్లు, ద్విచక్రవాహనం దగ్ధమయ్యాయి. పేలుడు ధాటికి భారీ శబ్దం రావడంతో స్థానికులు భయంతో పరుగులు తీశారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు.

# కాళేశ్వరం ప్రాజెక్టును తక్కువ చేసే యత్నం

- అధికారంలో ఉండగా ప్రాణహిత కోసం చేసిందేమీ లేదు
- కేసీఆర్ ముందుచూపుతోనే కాళేశ్వరం నిర్మాణం
- బీఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు



**సిద్దిపేట, మే 9 :** కటిక చీకట్లోనూ కారుదీపం లాంటిది కాళేశ్వరం అని హరీశ్‌రావు తెలిపారు. ఎంత కరవు వచ్చినా నదిలో నీళ్లు ప్రవహించే సత్తా మేడిగడ్డకు ఉందని పేర్కొన్నారు. కేసీఆర్ ముందుచూపుతో ఆలోచించి కాళేశ్వరం నిర్మాణం చేపట్టారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును తక్కువ చేసి మాట్లాడితే తెలంగాణకు ద్రోహం చేసినట్లే అవుతుందని అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ నీటి సౌలభ్యతను తక్కువ చేసి మాట్లాడకండి అని హితవు పలికారు. జలహారతి అంటూ డ్రామాలు తప్ప కాంగ్రెస్‌లో నిజాయితీ లేదని విమర్శించారు. ఆనాడు ఏడున్నరేళ్లు.. ఈనాడు రెండున్నరేళ్లు కాంగ్రెస్ డ్రామాలు చేసిందని మండిపడ్డారు. మేడిగడ్డ మరమ్మతు చేసి సాగు, తాగు నీళ్లు ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. నాలుగేళ్లలో ప్రాణహితను పూర్తి చేస్తామని చెప్పి.. ఇప్పటివరకు తట్టెడు మట్టి తీయలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. 2024-25 బడ్జెట్‌లో ప్రాణహితకు రూ.2కోట్లు కేటాయించారని హరీశ్‌రావు తెలిపారు. 2025-26 బడ్జెట్‌లో ప్రాణహితకు రూ.30కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రాణహిత చేవెళ్లకు పెట్టింది రూ.50కోట్లు అని అన్నారు. తిప్పి తిప్పి రూ.84 కోట్లే కేటాయించారని.. వీటితో ప్రాణహిత పూర్తవుతుందా అని ప్రశ్నించారు. నిజంగానే కట్టే ఆలోచన ఉంటే బడ్జెట్‌లో నిధులు పెంచాలి కదా అని నిలదీశారు. ప్రాణహితకు సంబంధించి రూ.11వేల కోట్ల పనులు పూర్తయ్యాయని నిన్న రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పాడని మండిపడ్డారు. అసలు కాంగ్రెస్ హయాంలో భూసేకరణ, పనులకు అయిన ఖర్చు రూ.3708 కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి చెబుతున్న అబద్ధాలకూ హద్దూ పద్దూ ఉండాలని అన్నారు. ఆనాడు జలయజ్ఞం కాదు.. ధన యజ్ఞం అన్న రేవంత్ ఇవాళ గొప్పలు మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఊసరవెల్లిలా రేవంత్ రెడ్డి రంగులు మారుస్తున్నాడని మండిపడ్డారు. 30 నెలలుగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లను మరమ్మతు చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండుటెండల్లోనూ 6400 క్యూసెక్కుల నీరు పోతుందని అన్నారు. మేడిగడ్డ మరమ్మతు చేస్తే కేసీఆర్‌కు పేరొస్తదని తమ్మిడిహట్టి అంశం తీసుకొస్తున్నారని తెలిపారు. రాష్ట్రం గురించి రేవంత్ రెడ్డి ఏ మాత్రం ఆలోచించడం లేదని విమర్శించారు.



# అక్రమ కేసులు పెట్టినా ప్రశ్నిస్తూనే ఉంటా

## సంగారెడ్డి జైలునుంచి క్రిశాంక్ విడుదల

**సంగారెడ్డి, మే 9:** కాంగ్రెస్ పార్టీని ప్రశ్నిస్తున్నందుకే తనపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నారని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ వ్యాఖ్యానించారు. శనివారం ఉదయం సంగారెడ్డి సెంట్రల్ జైల్ నుంచి క్రిశాంక్ విడుదలయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్ని కేసులు పెట్టినా ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. గతంలో హైదరాబాద్ ఏటీఎం కాడ్ద కాల్పులు జరిపి దొంగలు పారిపోయారని, కరీంనగర్ జ్యువెలరీ షాపులో దొంగలు కాల్పులు జరిపి నగలు ఎత్తుకెళ్లారని అన్నారు. సీపీ సుమతికి అర్ధరాత్రి రక్షణ లేకుండా పోయిందని క్రిశాంక్ అన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ క్వార్టర్స్‌లోనే రక్షణ లేదని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై కాకుండా శాంతి భద్రతలపై దృష్టి సారించాలని హితవుపలికారు. మీడియా వాళ్లతో కూడా మాట్లాడితే ఎందుకు మాట్లాడావని అడుగుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తమ ఫోన్లు ట్యాపింగ్, వైఫై హ్యాకింగ్ చేస్తుందన్న అనుమానం కలుగుతోందని క్రిశాంక్ పేర్కొన్నారు.

# తుమ్మడిహట్టిపై ప్రధానిని ఒప్పించండి

## కాంగ్రెస్ ప్రభుత్వానికి జీవన్ రెడ్డి సవాల్



**జగిత్యాల, మే 9:** తుమ్మడిహట్టి బ్యారేజీ పూర్తి చేసి ప్రాణహిత జలాలను ఎల్లంపల్లికి మళ్లించాకే.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లు అడగాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి పేర్కొన్నారు. తుమ్మడిహట్టి పేరుతో కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. రెండున్నరేళ్లయినా తట్టెడు మట్టి కూడా ఎత్తకేండా ఇప్పుడు హడావిడి చేస్తున్నారని ఆరోపిం చారు. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డును ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావుతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వరి, మక్కల కొనుగోళ్లు, తరలింపులో జాప్యంపై మండిపడ్డారు. ప్రధాన మంత్రి మోదీ, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిది 'బడే బాయ్ చోటే బాయ్' బంధమని, హైదరాబాద్‌కు రానున్న ప్రధానికి తుమ్మిడిహట్టిపై విన్నవించి అంగీకారం తీసుకువస్తే పాలాభిషేకం చేస్తామన్నారు. పగుళ్లు వచ్చిన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లకు కాంట్రాక్టర్ మరమ్మతులు చేస్తానన్నా ప్రభుత్వం ఎందుకు అంగీకరించడం లేదని ప్రశ్నించారు.

# రాష్ట్రంలో కుప్పకూలిన శాంతిభద్రతలు

## కేంద్ర మంత్రి కుమారుడిని రక్షించేందుకు ప్రభుత్వం తంటాలు..

## సంజయ్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ : ఆర్ఎస్ ప్రవీణ్

**హైదరాబాద్, మే 9 :** రాష్ట్రంలో గత 15 రోజులుగా శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, పోలీస్ శాఖ కేవలం తూతూమంత్రంగా పనిచేస్తోందని బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న హత్యలు, దోపిడీలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్‌లో మాజీ ఐపీఎస్ అధికారి భార్యను హత్య చేసిన నిందితులను ఇప్పటికీ పట్టుకోలేదని, కరీంనగర్‌లో పట్టపగలే బంగారు దుకాణంలో చోరీ జరిగినా పోలీసులు విఫలమయ్యారని విమర్శించారు. చివరకు మాల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌కే రక్షణ లేని పరిస్థితి నెలకొందని, 40 మంది ఆకతాయిలు ఆమెను వేధించడం రాష్ట్రంలో నెలకొన్న దారుణ పరిస్థితులకు అద్దం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై వచ్చిన అత్యాచార ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం, పోలీసుల తీరును ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లి 8గంటల పాటు వేచి ఉన్నా పోలీసులు వెంటనే స్పందించలేదని, నిందితుడిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సంజయ్ ఒత్తిడి మేరకే బాధితురాలి కుటుంబంపై నిర్మల్‌లో ఎదురు కేసులు పెట్టించారని, ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బండి సంజయ్, కిషన్ రెడ్డిల మధ్య అవినాభావ సంబంధం ఉందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. బండి సాయి భగీరథ్‌పై గతంలో మహేంద్ర యూనివర్సిటీలో యాంటి ర్యాగింగ్ కేసులు ఉన్నాయని గుర్తు చేస్తూ, అతనిపై వెంటనే పీడీ యాక్ట్ నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబాన్ని బీజేపీ సోషల్ మీడియా వింగ్ 'హనీ ట్రాప్' పేరుతో దుష్ప్రచారం చేస్తూ వేధిస్తోందని, నిందితుడు జేమ్స్ బాండ్ కాదని, అతనొక నేరస్తుడని మండిపడ్డారు. ఈ కేసులో సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉన్నందున సీబీఐ విచారణ జరిపించాలని, అలాగే బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని కోరారు. బాధితురాలి తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందని, ప్రధాని మోదీ ఈ విషయంలో తక్షణమే స్పందించాలని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.

# రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

- సీఎం చేతిలో హోంశాఖ ఉన్నా సమీక్షలు లేవు
- భగీరథ్ కేసులో చట్టం తన పని తాను చేయాలి
- మాజీ మంత్రి సబిత డిమాండ్



**హైదరాబాద్, మే 9:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు నమోదైనట్లు వార్తలు వచ్చిన విషయంపై మాజీహోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. 17సంవత్సరాల బాలికకు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ఆల్కహాల్ తాగించి అత్యాచారం చేయించడంతో పేట్‌బషీరాబాద్‌లో కేసు నమోదైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ.. ఒకప్పుడు తెలంగాణ పోలీస్ అంటే దేశంలో మొదటి స్థానంలో దక్షిణాది రాష్ట్రాల్లో కూడా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అలాంటి పోలీసులు ఈ రోజు దేశంలోనే వెనకడుగు వేస్తున్న రాష్ట్రంలో తెలంగాన ఉందంటే బాధ అనిపిస్తుంది. ఆందోళన కూడా కనిపిస్తుంది.. ప్రభుత్వాలు మారుతుంటాయి. దాంతోపాటు ప్రాధాన్యాతలు కూడా మారుతాయి. కానీ ప్రాథమిక బాధ్యత అయిన శాంతిభద్రతలు విస్మరిస్తే రాష్ట్రమే అధోగతి పాలవుతుందని అనడానికి ఈ రెండున్నర సంవత్సరాలు ఉదాహరణన్నారు.. మన రాష్ట్రంలో శాంతి భద్రతలు అనగానే రాజకీయ వేధింపులు, ప్రతిపక్షంలో ఉన్నవారిని ట్రాప్ చేయడం తప్పితే ఏం జరగుతుంది రాష్ట్రంలో అనేదానిపై రివ్యూ చేసుకునే పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. తెలంగాణ సాధించుకున్నమంటే ఏదో భౌగోళికంగా సాధించుకున్నది కాదు. ప్రశాంతమైన వాతావరణం ఉండాలి.. పెట్టుబడులు వెల్లువలా రావాలి. ఈ రాష్ట్రంలో ఉన్న యువత అందరికీ ఉపాధి దొరకాలినే ఆలోచనతో ఈ రాష్ట్రాన్ని సాధించుకున్నం అని అన్నారు. ఈరాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాల్సిన ప్రభుత్వానికి ఉందని విజ్ఞప్తి చేస్తున్నా. రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా హోంమంత్రి దగ్గరకు పరెగెత్తేవాళ్లు. రాష్ట్రంలో హోంమంత్రి లేరు. ఎందుకంటే ముఖ్యమంత్రే హోం మంత్రి. కానీ ఒక్కోసారి ఆ బాధ్యతను విస్మరించాలరేమో అనిపిస్తుంటుంది. ఎప్పుడు వెళ్లినా ముఖ్యమంత్రి కమాండ్ కంట్రోల్ సెంట్రల్‌లో సమీక్ష చేస్తున్నారని ఎప్పుడూ వింటుంటాం. ఏం సమీక్ష చేస్తున్నారని.. అనుకుంటే ఒక హోంశాఖ తప్ప మిగితా అన్ని సమీక్షలు జరుగుతంటాయి. కానీ కమాండ్ కంట్రోల్‌లో కూర్చొని హోంశాఖను సమీక్షించాలన్న ఆలోచన ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి లేదని చెప్పుకోవాల్సి రావడం బాధాకరమైన విషయమన్నారు. కేంద్రమంత్రి కొడుకా.. వేరే వ్యక్తి కొడుకా అని కాదు.. తప్పు చేసినప్పుడు సామాన్యుడికి ఏ చట్టం ఉంటుందో ఆయనకు కూడా అదేచట్టం ఉండాలే. ఎవరైతే కంప్లైయింట్ ఇచ్చారో దాన్ని రిసీవ్ చేసుకోవాలె. కచ్చితంగా పోక్సో కేసు పెట్టాల్సిందే. ఎందుకంటే రిపోర్ట్ తీసుకుంటే ఆ అమ్మాయి 17 ఏండ్లు అని విన్నా. కాబట్టి పెట్టాల్సిందే. కేసు రిజిస్టర్ చేయాల్సిందే. చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిందని సబిత అన్నారు.

# నల్గొండలో 104 కేజీల గంజాయి పట్టివేత

## అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్ - లారీ, ఫోన్లు స్వాధీనం

## ముగ్గురు స్థానిక విక్రేతలు కూడా కటకటాల్లోకి..

## ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడి




**నల్గొండ, మే 9:** జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. శనివారం నిర్వహించిన వేర్వేరు దాడుల్లో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకుని, అంతర్రాష్ట్ర నేరగాళ్లతో పాటు స్థానిక విక్రేతలను అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. విజయవాడ నుండి హైదరాబాద్‌కు లారీలో భారీగా గంజాయి తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో కేతేపల్లి ఎస్సై సతీష్ తన సిబ్బంది మరియు క్లూస్ టీమ్‌తో కలిసి కొర్లపహాడ్ టోల్ ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వచ్చిన అశోక్ లేలాండ్ లారీని ఆపగా, అందులోని ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని లారీని సోదా చేయగా, 104.5 కేజీల గంజాయి బయటపడింది. నిందితులను జమ్మూ కాశ్మీర్‌కు చెందిన పరంవీర్ సింగ్, మహారాష్ట్రకు చెందిన షా ఆలం పరవేజ్ ఆలం అన్సారీగా గుర్తించారు. వీరి వద్ద నుండి లారీతో పాటు రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురు ప్రధాన నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని ఎస్పీ తెలిపారు. మరో ఘటనలో, నల్గొండ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై వై. సైదులు తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, రెండు బైకులపై అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 300 గ్రాముల గంజాయి, రెండు బైకులు, రెండు ఫోన్లు లభించాయి. నిందితులను మహమ్మద్ అబ్దుల్ నయీమ్ అలియాస్ ముజీబ్, మహమ్మద్ సోహైల్, షేక్ లతీఫ్‌గా గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు, రవీంద్రనగర్‌కు చెందిన రౌడీషీటర్ బంటు కార్తీక్ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. కార్తీక్ ఇతర ప్రాంతాల నుండి గంజాయి తెచ్చి వీరికి సరఫరా చేస్తున్నాడని, నిందితులు దానిని చిన్న ప్యాకెట్లుగా చేసి ఒక్కొక్కటి రూ. 500కు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితుల్లో ఒకరైన అబ్దుల్ నయీమ్‌పై గతంలో హైదరాబాద్‌లోని మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌లో ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

# క్లాస్‌లో డెమో ఇస్తూ కుప్పకూలిన టీచర్

## గుండెపోటుతో మృతి

**ఖమ్మం, మే 9:** జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. క్లాస్ రూమ్‌లో డెమో ఇస్తూ గుండెపోటుతో కుప్పకూలాడు ఓ ఉపాధ్యాయుడు. శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా మధిరలో చోటు చేసుకుంది ఈ విషాద ఘటన. జిల్లాలోని మధిర పట్టణం రెండోవార్డు ఎంఎ÷-లాయిన్ కాలనీకి చెందిన ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు గారపాటి జయరాజ్ ఖమ్మంలోని మమతా రోడ్ లో ఉన్న శ్రీ చైతన్య ఒలంపియాడ్ స్కూల్ లో వర్క్ షాప్ కి హాజరయ్యాడు. వర్క్ షాప్ లో భాగంగా క్లాస్ రూమ్ లో డెమో ఇస్తుండగా గుండెపోటుతో కుప్పకూలాడు జయరాజ్. డెమో ఇస్తున్న జయరాజ్ ఒక్కసారిగా కుప్పకూలడంతో అతనిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు సహ ఉపాధ్యాయులు. అయితే.. అప్పటికే జయరాజ్ మరణించినట్లు తెలిపారు డాక్టర్లు. జయరాజ్ డెమో ఇస్తూ కుప్పకూలిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. జయరాజ్ మరణంతో అతని కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. అప్పటిదాకా హుషారుగా పాఠం చెబుతున్న జయరాజ్ ఒక్కసారిగా కుప్పకూలడం జీర్ణించుకోలేక పోతున్నామని అంటున్నారు తోటి ఉపాధ్యాయులు. ఈ ఘటనతో మధిర పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.







సంపాదకీయం

# తమిళనాట భేతాళ ప్రశ్నలు?

తమిళనాట ప్రతిష్టంభనకు చిన్న పార్టీలు ఆడుతున్న పెద్ద డ్రామాలు కలుషిత రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. లెఫ్ట్ పార్టీలు, ముస్లిం పార్టీ సహా ఇతర చిన్న పార్టీలు ఒకటి అరా సీటు సంపాదించినా బేరాలాడుతున్న తీరు వల్ల తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటుకు ఆటంకాలు వస్తున్నాయి. ఈ క్రమంలో తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై ఇంకా సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. టీవీకేకు ఏఎంఎంకే మద్దతు ఇచ్చినట్లు వస్తున్న వార్తలను ఆ పార్టీ అధినేత దినకరన్ తోసిపుచ్చారు. తమ ఎమ్మెల్యే మద్దతిస్తున్నారని పేర్కొంటూ గవర్నర్‌కు టీవీకే నేతలు జిరాక్స్ కాపీ ఇచ్చినట్లు తెలుస్తోందన్నారు. అయితే, అసలైన లేఖ ఎక్కడుందో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అది లభిస్తేనే వాస్తవాలు బయటపడతా యన్నారు. లేఖపై తాను సంతకం చేస్తున్నట్లు టీవీకే విడుదల చేసిన వీడియోపై ఏఎంఎంకే ఎమ్మెల్యే కామరాజ్ స్పందిస్తూ.. అది కృత్రిమ మేధ ఆధారిత వీడియో అని ఆరోపించారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమంటూ టీవీకే అధినేత విజయ్ వరుసగా గవర్నర్‌ను కలుస్తుండటంపై డీఎంకే విమర్శలు గుప్పించింది. గవర్నర్‌ను సంప్రదించడానికి ముందే ఇతర పార్టీల మద్దతును కూడగట్టుకోవాలని సూచించింది. ఎమ్మెల్యేల మద్దతు లేకుండా గవర్నర్‌కు లేఖ ఎందుకు ఇవ్వడమని ప్రశ్నించింది. రాష్ట్రంలో నెలకొన్న అసాధారణ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో.. అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ నేతృత్వంలోని టీవీకేను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించా లని పీఎంకే వ్యవస్థాపకుడు రామదాస్ పేర్కొన్నారు. ప్రజాతీర్పును ప్రతిఒక్కరూ గౌరవించాల్సిందే నన్నారు. ప్రభుత్వ ఏర్పాటు పక్రియలో జాప్యం చేయొద్దని.. వెంటనే దీనిని పూర్తిచేయాలంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ మెజార్టీ లేక ప్రభుత్వ ఏర్పాటులో ఇబ్బందులు పడుతున్న విజయ్.. త్వరలో వీసీకే చీఫ్‌ను కలవనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈసందర్భంగా తమకు మద్దతు ఇవ్వాలని కోరనున్నట్లు తెలిసింది. ప్రజా తీర్పును వమ్ము చేసేలా చిన్న పార్టీలు దోబూచులాడు తున్నాయి. మద్దతుకు ఓకే చెప్పి గవర్నర్‌కు లేఖలు అందించడంలో వెనక్కి తగ్గాయి. దీంతో మెజార్టీ విషయంలో గవర్నర్ సంతృప్తి చెందక పోవడంతో ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియలో ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. 234 స్థానాలున్న అసెంబ్లీలో 108 స్థానాల్లో విజయ దుందుభి మోగించింది. అధికారం పొందడానికి అవసరమైన మేజిక్ ఫిగర్ కు కేవలం పదకొండు స్థానాలు తక్కువ. ఇటువంటి పరిస్థితిలో అసెంబ్లీలో అతి పెద్ద పార్టీగా అవతరించిన పార్టీ నేతను ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించడం అన్నది కేవలం ఆనవాయితీ మాత్రమే. గతంలో అటల్ బిహారి వాజ్‌పేయి నాయకత్వంలోని బిజెపికి నాటి రాష్ట్రపతి అటువంటి అవకాశం ఇవ్వడం 13 రోజుల్లో మెజారిటీ రుజువు చేసుకోలేక వాజ్‌పేయి రాజీనామా చేసిన విషయం అందరికీ తెలిసిందే! దేశంలోనూ వివిధ రాష్ట్రాల్లోనూ ఇటువంటి దృష్టాంతాలెన్నో జరిగాయి. అయితే ప్రమాణానాఇకి ముందు మద్దతు లేఖలతో సం÷-యా బలం తెలుసుకోవడం గవర్నర్ విధి. దీనిని ఎవ్వరూ తప్పు పట్టాల్సిన పనిలేదు. తమిళనాడు ప్రజలు విజయ్ నాయకత్వంలోని టివికె పార్టీకి మె.ఆర్టీ సీట్లు కట్టబెట్టారు. ఫలితాలు వచ్చిన మరునాడే అతి పెద్ద పార్టీగా వచ్చిన తమను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజయ్ చేసిన విజ్ఞప్తిని గవర్నర్ ఆహ్వానిస్తూనే మద్దతు లేఖలు కోరారు. అయితే విజయ్ కూడా ఈ విషయంలో కొంత డ్రామాలు ఆడుతున్నట్లుగా ఉంది. అయిదు సీట్లున్న కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉన్నప్పటికీ మెజారిటీకి అవసరమైన మద్దతు మాత్రం చూపడం లేదు. తమిళ ప్రజా తీర్పును అమలు చేయడానికి తమిళనాట గందరగోళం సృష్టించాలని తమిళ పార్టీలే యత్నిస్తున్నాయి. వామపక్షాలు బేషరతు నిర్ణయం తీసుకొని టివికె ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ప్రకటించాయి. విసికె మద్దతు లేఖ ఇస్తే మేజిక్ ఫిగర్ చేరుకోవడం సులువవుతుంది. ఈ క్రమంలో తమిళనాడులో నూతన ప్రభుత్వం ఏర్పాటుపై ఇంకా ప్రతిష్టంభన వీడలేదు. విజయ్ నేతృత్వంలోని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ.. ప్రభుత్వ ఏర్పాటుకు సతమతమవుతోంది. చిన్న పార్టీల మద్దతు ఉందని చెబుతూ మూడు రోజుల్లో మూడుసార్లు గవర్నర్‌ను కలిసినా.. ప్రభుత్వ ఏర్పాటుకు ఆ రాష్ట్ర లోక్‌భవన్ నుంచి పిలుపు రాకపోవడం తమిళ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠగా మారింది. ఇదంతా కేవలం మద్దతు ఇస్తున్న పార్టీల లేఖలు సమకూర్చడంలో చేస్తున్న జాప్యంగానే చయేడాలి.



# బెంగాల్ సీఎంగా సువేందు అధికారి

- ఆయనతోపాటు ఐదుగురు మంత్రుల ప్రమాణం
- ప్రమాణం చేయించి గవర్నర్‌ఆర్ఎన్ రవి
- హాజరైన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు
- చంద్రబాబు సహా పలు రాష్ట్రాల సీఎంలు హాజరు





**కోల్‌కతా, మే 9:** పశ్చిమ బెంగాల్‌లో మొదటిసారి కమలదళ సర్కారు కొలువుదీరింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా భాజపా నేత సువేందు అధికారి శనివారం ప్రమాణస్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో సువేందు చేత బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రమాణం చేయించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర 9వ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేశారు. అగ్నిమిత్ర పాల్, దిలీప్ ఘోష్, అశోక్ కిర్తానియా, నిశిత్ ప్రామాణిక్, క్షుదిరామ్ టుడు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రులు జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, యోగి ఆదిత్యనాథ్, రేఖా గుప్తా, భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్ తదితరులు హాజరయ్యారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం సృష్టించిన సంగతి తెలిసిందే. బీజేపీ 207 స్థానాల్లో ఘన విజయం సాధించింది. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ 80 సీట్లకే పరిమితం అయింది. సువేందు అధికారి రెండు చోట్ల పోటీ చేశారు. నందిగ్రామ్, భవానీపూర్ నుంచి ఆయన బరిలో నిలిచారు. భవానీపూర్ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం కావటం విశేషం. సువేందు భవానీపూర్‌లో మమతాపై 15 వేల ఓట్ల మెజార్టీతో గెలుపు సాధించారు. అవివాహితుడైన 55 ఏళ్ల సువేందు.. బెంగాల్ కు 9వ సీఎంగా ప్రమాణం చేశారు. ఈ పదవి చేపట్టిన తొలి భాజపా నేతగా అరుదైన చరిత్ర సృష్టించారు. 1970 డిసెంబరు 15న బెంగాల్ తూర్పు మేదినీపూర్ జిల్లాలో సువేందు జన్మించారు. 1998లో మమతా బెనర్జీ స్థాపించిన తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. అప్పటినుంచి దీదీకి నమ్మినబంటులా మారారు. 2004లో తమలుక్ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2006లో తొలిసారి కాంథీ దక్షిణ్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత రెండుసార్లు ఎంపీగా గెలిచి లోక్‌సభకు వెళ్లారు.గతంలో మమతా బెనర్జీ క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారు. మమత మేనల్లుడి కారణంగా ఆమెతో విభేదించి.. 2020లో టీఎంసీని వీడి కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటినుంచి రాష్ట్రంలో భాజపాను ముందుండి నడిపించారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో, తాజా ఎన్నికల్లో భవానీపూర్‌లో మమతా బెనర్జీని రెండుసార్లు ఓడించి సంచలనం సృష్టించారు.

# బెంగాల్ ప్రజలకు మోడీ సాష్టాంగ ప్రణామం

అశేషంగా హాజరైన ప్రజలకు అభివాదం



**కోల్‌కతా, మే 9:** పశ్చిమ బెంగాల్ నూతన ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ ప్రజలకు సాష్టాంగ వందనం చేశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. భారీ సంఖ్యలో హాజరైన ప్రజలను చూసిన ప్రధాని మోదీ ముందుగా చేతులు ఊపుతూ అభివాదం చేశారు. అనంతరం మోకాళ్లపై కూర్చుని, చేతులు జోడించి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ బెంగాల్ చరిత్రలో బీజేపీ తొలిసారిగా అధికారంలోకి వచ్చింది. తమకు మద్దతుగా నిలిచిన ఆ రాష్ట్ర ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ విధంగా తన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ అగ్రనేతలు హాజరయ్యారు. దాదాపు పదిహేనేళ్లు పశ్చిమ బెంగాల్‌ను పాలించిన మమతా బెనర్జీ తాజా ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. గతంలో తృణమూల్ కాంగ్రెస్‌లో ఉన్న సువేందు అధికారి, ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నేతగా ఎదిగారు. బెంగాల్‌లో బీజేపీ విజయంలో కీలక పాత్ర పోషించి ఏకంగా ముఖ్యమంత్రి అయిపోయారు.

# ఇస్లామాబాద్ వేదికగా అమెరికా- ఇరాన్ మధ్య మరోసారి చర్చలు

- రంగంలోకి 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్ ప్లస్'
- యూఎన్ చీఫ్‌కు ఇరాన్ లేఖ
- ఉల్లంఘనలపై అమీర్ సయీద్ హెచ్చరిక!



**ఇస్లామాబాద్ / వాషింగ్టన్:** పశ్చిమాసియాలో సంఘర్షణను ముగించడమే లక్ష్యంగా కీలక ముందడుగు పడింది. ఓ ఒప్పందానికి సంబంధించి అమెరికా- ఇరాన్ మరోసారి చర్చలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ కు ఇరుదేశాల ప్రతినిధులు వచ్చేవారం రానున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. సంఘర్షణకు ముగింపు పలకడమే లక్ష్యంగా.. 14 పాయింట్ల అవగాహన ఒప్పందంపై ఇరుదేశాలు సంతకాలు చేసే అవకాశం ఉందని ఆ కథనాలు వెల్లడించాయి. ఇందులో ఇరాన్ అణు కార్యక్రమం, దానివద్ద ఉన్న యురేనియం నిల్వల బదిలీ, హార్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలను తగ్గించడం వంటి కీలక విషయాలు ఉన్నాయి. తమపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని టెహ్రాన్ ముందునుంచీ డిమాండ్ చేస్తూ వస్తోంది. ఈ చర్చలకు ఇవే అడ్డంకిగా మారాయి. కాగా.. చర్చలు సానుకూలంగా సాగితే ఇరుదేశాల మధ్య కొనసాగుతోన్న కాల్పుల విరమణ ఒప్పందం మరికొంతకాలం పొడిగించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇక, పశ్చిమాసియా సంఘర్షణ ముగించేందుకు తాము పంపిన ప్రతిపాదనలపై ఇరాన్ నుంచి నేడు స్పందన వచ్చే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఇరాన్ ఉద్దేశపూర్వకంగానే ఈ విషయాన్ని సాగదీస్తుందా అని విలేకరులు అడగ్గా.. త్వరలోనే మనకు దీని గురించి తెలుస్తుందన్నారు. హార్మూజ్‌లో చిక్కుకుపోయిన నౌకలను సురక్షితంగా బయటకు తెచ్చేందుకు చేపట్టిన 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను తిరిగి పునరుద్ధరించే విషయాన్ని తమ యంత్రాంగం పరిశీలిస్తుందని ట్రంప్ అన్నారు. ఇరాన్ త్వరగా ఒప్పందంపై సంతకం చేయకపోతే.. ఈ కార్యక్రమాన్ని 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్ ప్లస్'గా నిర్వహిస్తామన్నారు. నౌకలను సురక్షితంగా బయటకు తీసుకురావడంతో పాటు మరికొన్ని చర్యలను కూడా చేపడతామన్నారు.

### అలా అయితే.. విపత్కర పరిణామాలు తప్పవు: ఇరాన్ హెచ్చరిక

అమెరికాకు ఇరాన్ గట్టి హెచ్చరికలు చేసింది. ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్‌కు యూఎన్‌లోని ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమీర్ సయీద్ ఇరవానీ ఓ లేఖ రాశారు. ఇందులో హార్మూజ్ జలసంధిలో సైనిక చర్యలకు దిగి యూఎస్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆరోపించారు. పర్షియన్ గల్ఫ్, హార్మూజ్‌లలో యూఎస్ తన సైనిక కార్యకలాపాలు కొనసాగిస్తే.. విపత్కర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



# విజయ్‌కు లైన్ క్లియర్

మద్దతు లేఖ అందజేసిన వీసీకే

**చెన్నై:** విజయ్ టీవీకే ఎట్టకేలకు ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ మార్క్ సాధించింది. టీవీకేకు బేషరతుగా తమ మద్దతును వీసీకే అధ్యక్షుడు తొల్ తురుమావళవన్ అధికారికంగా ప్రకటించారు. మద్దతు లేఖను స్వయంగా టీవీకేకు అందజేశారు. దీంతో తమిళ నాడులో కొత్త ప్రభుత్వ ఏర్పాటు కోసం అవసరమైన 118 మంది సభ్యుల సంఖ్యాబలం టీవీకేకు చేకూరింది. కాంగ్రెస్, వామపక్షాల మద్దతుతో టీవీకే బలం 116కు చేరుకోవడం, మరో ఇద్దరు ఎమ్మెల్యేల బలం అవసరం కావడంతో శుక్రవారం రాత్రి నుంచి ఉత్కంఠ కొనసాగుతూ వచ్చింది. దీనికి ముందు పూర్తి సంఖ్యా బలంతో తమ వద్దకు రావాలని గవర్నర్ ఆర్లేకర్ స్పష్టం చేయడంతో మూడు సార్లు గవర్నర్‌ను కలిసిన విజయ్‌కు నిరాశ ఎదురైంది. సంఖ్యాబలం నిరూపించుకోవడానికి ఈనెల 10 తేదీ గడువు కావడంతో ఉత్కంఠ కొనసాగుతూ వచ్చింది. ఈ క్రమంలో వీసీకే మద్దతు అనివార్యమైంది. ఎట్టకేలకు బేషరుతుగా టీవీకేకు మద్దతిస్తున్నట్టు వీసీకే ప్రకటించడంతో విజయ్ పార్టీ సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది.

### గవర్నర్‌ను కలవనున్న విజయ్

వీసీకే మద్దుతుతో మ్యాజిక్ ఫిగర్ సాధించిన విజయ్ నేరుగా గవర్నర్‌ను మరోసారి కలవనున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరుతారు. గవర్నర్ నుంచి ఆహ్వానం అందగానే ఏమాత్రం జాప్యం లేకుండా ప్రమాణస్వీకారం ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# మాజీ సీఎంగా పేరు మార్చుకున్న దీదీ

ఎక్స్ బయోను అప్‌డేట్ చేసిన మమత



**కోల్‌కతా, మే 9:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన మమతా బెనర్జీ.. ఎట్టకేలకు తన పరాజయాన్ని అంగీకరించారు. రాష్ట్రంలో భాజపా సర్కారు కొలువుదీరిన నేపథ్యంలో.. ఆమె తన ఎక్స్ బయోను అప్‌డేట్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన మమత ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ సీఎం పదవికి రాజీనామా చేసేందుకు నిరాకరించారు. ఆ తర్వాత మే 7వ తేదీతో అసెంబ్లీ గడువు పూర్తైన నేపథ్యంలో గవర్నర్ ఆర్ఎన్ రవి దానిని రద్దు చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. నేడు రాష్ట్ర సీఎంగా భాజపా (నేత సువేందు అధికారి ప్రమాణం చేశారు. దీంతో దీదీ తన ఎక్స్ బయోను అప్‌డేట్ చేశారు. 'అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ వ్యవస్థాపక ఛైర్‌పర్సన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి (15, 16, 17వ విధానసభ)' అని మార్చుకున్నారు. అంతకుముందు 'పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి'




## పలువురు ఐఏఎస్‌ల బదిలీలు

**అమరావతి, మే 9:** ఆంధ్రప్రదేశ్‌లో పలువురు ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఐఏఎస్ అధికారుల బదిలీలు, అదనపు బాధ్యతలపై శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న శశి భూషణ్ కుమార్‌కు జలవనరుల శాఖ బాధ్యతలు అప్పగించింది. జలవనరుల శాఖ స్పెషల్ సీఎస్, ఫుల్ అడిషనల్ ఛార్జ్ బాధ్యతల నుంచి సీఎస్ సాయి ప్రసాద్‌కు ప్రభుత్వం రిలీఫ్ ఇచ్చింది. పర్యావరణ, అటవీ శాఖ ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండేకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు జీఓ ఆర్టీ నెంబర్ 918ను సీఎస్ జి.సాయి ప్రసాద్ జారీ చేశారు.

## ఆల్మాస్‌పేటకు టిప్పు సర్కిల్‌గా పేరు

**ఆందోళనకు దిగిన హిందూ సంఘాలు**

**ఇరువర్గాల దాడులతో ఉద్రిక్తం..పోలీసుల లాఠీఛార్జ్**




**కడప, మే 9:** నగరంలోని ఆల్మాస్ పేట సర్కిల్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. సర్కిల్‌ను టిప్పు సుల్తాన్ సర్కిల్‌గా మార్చడంపై వివాదం చెలరేగింది. ఆల్మాస్ పేట సర్కిల్‌కు టిప్పు సుల్తాన్ పేరు పెట్టడాన్ని ఓ వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. హనుమాన్ సర్కిల్‌గా మార్చాలని పట్టుబడుతోంది. టిప్పు సుల్తాన్ పేరును కొనసాగించాలని మరో వర్గం ఆందోళనకు దిగింది. దీంతో సర్కిల్ వద్ద ఇరువర్గాలు ఆందోళనకు దిగాయి. ఇరువర్గాలకు చెందిన మద్దతుదారులు భారీగా అక్కడకు చేరుకున్నారు. సమాచారం అందిన వెంటనే పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలు అక్కడకు చేరుకున్నాయి. రెచ్చిపోయిన ఇరువర్గాలు పరస్పరం రాళ్ల దాడులకు దిగాయి. ఈ దాడుల్లో తాలూకా సీఐ నరసింహారావు, మరో ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వెంటనే పోలీసులు లాఠీచార్జి చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు.

## డిప్యూటీ సీఎం పవన్ చొరవ

**మస్కట్ నుంచి సొంతూరుకు చేరిన మహిళ**

**అన్నమయ్య, మే 9:** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో ఏపీకి చెందిన మహిళ మస్కట్ నుంచి క్షేమంగా స్వగ్రామానికి చేరుకుంది. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలానికి చెందిన షెహనాజ్ కుటుంబ జీవనం కోసం ఏజెంట్ ద్వారా మస్కట్‌కు వెళ్లి చిత్ర హింసలకు గురైంది. తనకు జీతం ఇవ్వడం లేదని, వేధింపులకు గురిచేస్తున్నారంటూ భర్తకు వీడియో కాల్ చేసి చెప్పింది. తనను రక్షించాలంటూ డిప్యూటీ సీఎం పవన్‌ను వేడుకుంది. షెహనాజ్ బాధలు విన్న వెంటనే డిప్యూటీ సీఎం పవన్ స్పందించారు. మహిళను స్వగ్రామానికి రప్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని తన కార్యాలయ అధికారులకు ఆదేశించారు. ఎట్టకేలకు ఉప ముఖ్యమంత్రి చొరవతో షెహనాజ్ స్వగ్రామానికి చేరుకుంది. కేవలం ఐదు రోజుల్లోనే మస్కట్ నుంచి మహిళను స్వగ్రామానికి డిప్యూటీ సీఎం పేషీ అధికారులు చేర్చారు. మస్కట్ నుంచి ముంబైకి అటు నుంచి విజయవాడకు వాల్మీకిపురం మహిళ షెహనాజ్ చేరుకుంది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పేషీ అధికారులు.. మహిళకి రూ 30,000 నగదు, చీర బహూకరించి సురక్షితంగా స్వగ్రామానికి పంపించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డికి షెహనాజ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. తనను సమస్యల నుంచి రక్షించి స్వగ్రామం చేర్చడంతో పాటు ఆర్థిక సహాయం అందించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపింది.

## శ్రీశైలం భక్తులకు టోపీ

**నంద్యాల,మే9:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో మరోసారి సైబర్ నేరగాళ్ల నకిలీ వెబ్‌సైట్ల దందా బయటపడింది. ఢిల్లీకి చెందిన 27 మంది భక్తులను సైబర్ కేటుగాళ్లు మోసం చేసిన ఘటన కలకలం రేపుతోంది. భక్తులు వసతి కోసం 'మల్లికార్జున సదన్' పేరుతో ఉన్న నకిలీ వెబ్‌సైట్ ద్వారా రూమ్స్ బుక్ చేసుకున్నారు. ఫేక్ ఐడితో భక్తుల నుంచి రూ.15,000 వసూలు చేసినట్లు తెలిసింది. ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసిన తర్వాత భక్తులు శ్రీశైలం చేరుకున్నప్పుడు అసలు విషయం బయటపడింది. మల్లికార్జున సదన్ వద్దకు చేరుకున్న భక్తులు తమ బుకింగ్‌లు రికార్డులో లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించారు. వెంటనే వారు ఆలయ అధికారులను, పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఇదే మల్లికార్జున సదన్ పేరుతో నకిలీ వెబ్‌సైట్‌లు సృష్టించి భక్తులను మోసం చేశారు. సైబర్ నేరగాళ్లు మళ్లీ అదే విధంగా భక్తులను టా÷-గ్గ్÷ట్ చేయడం ఆందోళన కలిగిస్తోంది. సైబర్ కేటుగళ్ళ చేతిలో మోసపోయిన 27 భక్తులకు ఆలయ ఈవో శ్రీనివాసరావు ఉచితంగా దర్శనం, వసతి కల్పించారు.

# విశాఖకు మహర్దశ

మొదటి పేజీ తరువాయి



భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఏడు కనెక్టింగ్ రోడ్లను వీఎంఆర్డీఏ నిర్మిస్తోంది. ఇప్పటికే మూడు పూర్తయ్యాయి. భోగాపురం ఎయిర్‌పోర్టుకు బీచ్ కారిడార్ ప్రతిపాదన ఉంది. రూ.14వేల కోట్లతో తాగునీటి ప్రాజెక్టు వస్తోంది. ఇది పూర్తయితే 95 శాతం ఇళ్లకు తాగునీరు అందుతుందని మంత్రి నారాయణ వివరించారు. మాస్టర్ ప్లాన్ మేరకు విశాఖ పట్టాణాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ అన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. నగరం అభివృద్ధి చెందాలంటే మాస్టర్ ప్లాన్ అవసరమని ఆయన తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించామమని మంత్రి వెల్లడించారు. 'నగరం అభివృద్ధి చెందాలి అంటే మాస్టర్ ప్లాన్ అవసరం. 6,836 చదరపు కి.మీ పరిధిలో వీఎంఆర్డీఏ ఉంది. 4,387.36 చదరపు కిలోమీటర్ల పరిధిలో మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. మిగిలిన ప్రాంతంలో రానున్న అక్టోబర్ నెలకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తాం. వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌పై వచ్చిన వినతులపై సమీక్షలో చర్చ జరిపాం. ఎమ్మెల్యేలు తీసుకువచ్చిన వినతులు 90 శాతం పైగా పరిష్కారం చూపాం. 2021లో రూపొందించిన మాస్టర్ ఎ÷-లాన్‌ను రీవిజిట్ చేయాలని ప్రజా ప్రతినిధులు సీఎంను కోరారు. దీనిపై భారీ ఎత్తున అభ్యంతరాలు వచ్చాయి. తొలుత 3720 అభ్యంతరాలు రాగా రెండవసారి 1236 అభ్యంతరాలు వచ్చాయి. సమీక్షకు హాజరుకాని ఎమ్మెల్యేలతో చర్చించి మాస్టర్ ప్లాన్ ప్రకటిస్తాం' అని మంత్రి నారాయణ తెలిపారు. హైదరాబాద్ తరహాలో విశాఖలో సెమి రింగ్ రోడ్డు నిర్మించాలని సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కి.మీ మేర సెమి రింగ్ రోడ్డు నిర్మాణం. ఈనెల చివరికి సెమి రింగ్ రోడ్డు డీపీఆర్ సిద్ధం అవుతుంది. అలానే భోగాపురం విమానాశ్రయంకు బీచ్ కారిడార్ ప్రతిపాదన ఉంది. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఎస్టీపీలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రాపర్టీ టాక్స్ విషయంలో పాత విధానాన్ని కొనసాగిస్తున్నాం' అని మంత్రి నారాయణ వెల్లడించారు.మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ ఎకనామిక్ కారిడార్ ఆధారంగా సమీక్ష సమావేశం జరిగిందని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధి జోన్‌గా మారుతోందన్నారు.

## విధ్వంసం నుంచి వికాస దిశగా పయనం

**భయం నుంచి భరోసా దిశగా రాష్ట్రం అభివృద్ధి**

**మంత్రి గుమ్మిడి సంధ్యారాణి**




**అమరావతి, మే 9:** విధ్వంస పాలన నుంచి వికాస పాలన వైపు రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకెళ్తున్నారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... 23 నెలల కూటమి పాలనలో భయపెట్టే రాజకీయాలకు ముగింపు పలికి, భరోసా కలిగించే పరిపాలన అందుతోందన్నారు. వైసీపీ హయాంలో ప్రజల సమస్యలు చెప్పుకోవడానికే భయపడేవారని.. నేడు ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. వైజాగ్ అంటే ఒకప్పుడు గంజాయి గుర్తొచ్చేదని.. నేడు గూగుల్, టీసీఎస్ వంటి ప్రపంచ స్థాయి సంస్థలు గుర్తుకొస్తున్నాయని మంత్రి అన్నారు. అరకు, పాడేరు ప్రాంతాల్లో గంజాయి తోటల స్థానంలో కాఫీ తోటలు విస్తరిస్తున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్రకు రైల్వే జోన్ సాధించడం కూటమి ప్రభుత్వ చరిత్రాత్మక విజయంగా చెప్పుకొచ్చారు. యువత చేతిలో ఆయుధాలు కాదు.. ఉద్యోగాలు, నైపుణ్యాలు, అవకాశాలు ఉండాలనేదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని స్పష్టం చేశారు. అమరావతి నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడం రాష్ట్ర చరిత్రలో గొప్ప సంఘటనన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కేంద్ర సహకారంతో వేల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని సంధ్యారాణి అన్నారు. గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి కఠిన చర్యలు చేపట్టామని తెలిపారు. జగన్‌కు ఇంట్లో వారిపైనే గౌరవం లేదని.. ఇక ప్రజలపై గౌరవం ఎలా ఉంటుందని ప్రశ్నించారు. అధికార దాహం కోసం యువత చేతికి కత్తులు, గొడ్డళ్లు ఇచ్చే వైసీపీ నేతల మోసపూరిత మాటలకు బలికావొద్దని.. కోడికత్తి శ్రీను ఉదంతాన్ని గుర్తు తెచ్చుకోవాలని సూచించారు. సూపర్ 6 పథకాలు గిరిజనులకు ఎంతగానో తోడ్పడుతున్నాయని మంత్రి సంధ్యారాణి పేర్కొన్నారు.

## ప్రజలకు వేగవంతమైన న్యాయమే లక్ష్యం

**హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్**

**రాజమహేంద్రవరంలో కోర్టు భవనాల సముదాయం ప్రారంభం**

**రాజమహేంద్రవరం, మే 9:** తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో అత్యాధునిక వసతులతో నిర్మించిన 10 కోర్టు భవనాల సముదాయం శనివారం ఉదయం వైభవంగా ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ముఖ్య అతిథిగా విచ్చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించి ఈ నూతన భవనాలను ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రధాన న్యాయమూర్తికి పోలీసులు 'గార్డ్ ఆఫ్ హానర్'తో గౌరవ వందనం సమర్పించగా, వేద పండితులు 'పూర్ణకుంభం'తో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తులు నూతన కోర్టు హాళ్లను, అక్కడ ఏర్పాటు చేసిన ఆధునిక వసతులను కలియతిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ విశిష్టతలపై రూపొందించిన ప్రత్యేక వీడియో ప్రదర్శనను వారు వీక్షించారు. ఈ సభలో హైకోర్టు న్యాయమూర్తులు ప్రసంగిస్తూ.. సామాన్య ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించడంలో ఆధునిక మౌలిక వసతులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా న్యాయస్థానాల్లో సాంకేతికతను జోడించడం హర్షణీయమని వారు అభిప్రాయపడ్డారు. జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్. రఘునందన్ రావు, జస్టిస్ వి. ఎల్. ఎన్. చక్రవర్తి, జస్టిస్ సుమతి జగడం, జస్టిస్ న్యాపతి విజయ్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత గంధం స్వాగత ఉపన్యాసం చేస్తూ.. నూతన భవన నిర్మాణ క్రమాన్ని, ఇందులోని సౌకర్యాలను అతిథులకు వివరించారు. రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్.వి. ప్రసాద్‌కు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సహకార శాఖలో 'పారదర్శక' పదోన్నతులు

**100 మంది ఉద్యోగులకు ప్రమోషన్లు**

**అవినీతికి తావులేకుండా పోస్టింగులు**

**మంత్రి అచ్చెన్నాయుడు**

**మంత్రిని కలిసిన ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రతినిధులు**

**అమరావతి, మే 9 :** సహకార శాఖలో ఉద్యోగుల హక్కులను కాపాడుతూ, వారికి సకాలంలో పదోన్నతులు కల్పించడమే కాకుండా, పోస్టింగుల ప్రక్రియలో పూర్తిస్థాయి పారదర్శకత పాటించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేడర్లకు చెందిన సుమారు 100 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి. ఫణి పేర్రాజు నేతృత్వంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల ప్రతినిధులు విజయవాడలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా, అత్యంత వేగంగా ప్రమోషన్ ప్రక్రియను పూర్తి చేసినందుకు మంత్రికి అసోసియేషన్ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల కోరిక మేరకు మంత్రి అచ్చెన్నాయుడు కేక్ కట్ చేసి, వారికి స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. "ఉద్యోగులు సానుకూల వాతావరణంలో పనిచేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరుతాయి. పదోన్నతుల ప్రక్రియలో 100 శాతం పారదర్శకత పాటించాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని పేర్కొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఫణి పేర్రాజు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లలో సహకార శాఖలో వివిధ కేడర్లలో దాదాపు 350 మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు లభించడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ పక్కా ప్రణాళిక వల్ల ఈ ప్రక్రియ వేగవంతమైందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జీసీబీవీ కోటేశ్వరరావు, డి. విజయ్ కుమార్, పి. రాజశేఖర్, మొహమ్మద్ గౌస్, జి. సందీప్, యు. రమేష్, వై. యేసు కుమార్, ఎస్. భావనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ నాయకత్వ పటిమ అమోఘం

**బెంగాల్ సీఎం సువేందుకు పవన్ శుభాకాంక్షలు**

**అమరావతి, మే 9:** పశ్చిమ బెంగాల్‌లో తొలిసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సువేందు అధికారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో ఈ చరిత్రాత్మక విజయాన్ని సాధించడానికి సంవత్సరాల తరబడి పోరాటం చేశారన్నారు. దీనికి దృఢంగా నిలిచిన బీజేపీ బెంగాల్ నాయకత్వానికి, పార్టీ కార్యకర్తలకు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు. 'ప్రజాకేంద్రిత పాలనను అందించడంలో నూతన బీజేపీ ప్రభుత్వం విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను. దీనిని కేవలం బీజేపీ లేదా పశ్చిమ బెంగాల్ విజయంగానే కాకుండా, భారత ప్రజల గెలుపుగా భావిస్తున్నాను. సంవత్సరాలుగా హింస, అరాచకం, అక్రమ వలసలు, తీవ్రవాద చొరబాట్లపై పెరుగుతున్న ఆందోళనలకు పశ్చిమ బెంగాల్ సాక్ష్యంగా నిలిచింది. ఇవి సామాజిక సామరస్యం, జాతీయ భద్రతకు తీవ్రమైన సవాళ్లను విసిరాయి. ఇలాంటి కీలక సమయంలో జాతీయ భద్రతను బలోపేతం చేయడానికి, బలమైన పాలనతో ఈ సవాళ్లను పరిష్కరించడానికి ఇచ్చిన ఈ ప్రజా తీర్పు గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు, దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయ ఉద్యమానికి సైద్ధాంతిక పునాది వేసిన దార్శనికుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నా నివాళులు. శ్యామా ప్రసాద్ జన్మస్థలమైన పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ సాధించిన విజయం.. ఆయన దార్శనికత, సిద్ధాంతానికి తగిన నివాళిగా నిలుస్తోంది. ఈ ప్రజా తీర్పు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ అద్భుతమైన విజయానికి దోహదపడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, బీజేపీ పశ్చిమ బెంగాల్ అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య, ప్రతి బీజేపీ కార్యకర్తకు నా హృదయపూర్వక అభినందనలు' అంటూ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

# ప్రజలు సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి.

■ **కుల్కచర్ల ఎస్సై రమేష్ కుమార్**



**కుల్కచర్ల మండలం, మే,09(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు తెలియజేయునది ఏమనగా, ప్రస్తుతం బస్సులు, మార్కెట్లు, జాతరలు మరియు ఇతర రద్దీ ప్రాంతాలలో సెల్‌ఫోన్ దొంగతనాలు పెరుగుతున్నాయి. దొంగలు ఫోన్ దొంగలించిన వెంటనే అందులో ఉన్న సిమ్ కార్డులను వేరే మొబైల్ ఫోన్లలో ఉపయోగించి, గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి UPI యాప్స్ ద్వారా బాధితుల బ్యాంక్ ఖాతాల్లో ఉన్న డబ్బులను తమ ఖాతాలకు అక్రమంగా బదిలీ చేసుకుంటున్నారు. శుక్రవారం కుసుమసముద్రం గ్రామానికి చెందిన వడ్డె రాములు మొబైల్ ఫోన్ దొంగిలించబడగా, దొంగలు అతని సిమ్ కార్డు వేరే ఫోన్‌లో ఉపయోగించి అతని బ్యాంక్ ఖాతా నుండి రూ. 38,000/-లను వేరే ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేయడం జరిగింది. బాధితుడు వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయడంతో రూ. 20,000/- మొత్తాన్ని హోల్డ్‌లో ఉంచడం సాధ్యమైంది. ప్రజలు ఈ విధమైన సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండి క్రింది జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి:

1. బస్సులు, రద్దీ ప్రాంతాలు, మార్కెట్లలో మొబైల్ ఫోన్లను జాగ్రత్తగా ఉంచుకోవాలి.
2. మొబైల్ ఫోన్‌కు బలమైన పాస్‌వర్డ్ లేదా ఫింగర్ ప్రింట్ లాక్ పెట్టుకోవాలి.
3. UPI యాప్స్‌కు ప్రత్యేక PIN నెంబర్ ఉంచి ఇతరులతో పంచుకోకూడదు.
4. మొబైల్ పోయిన వెంటనే సంబంధిత సిమ్ కార్డును బ్లాక్ చేయించాలి.
5. ఫోన్ పోయిన వెంటనే బ్యాంక్ మరియు UPI సేవలను తాత్కాలికంగా నిలిపివేయాలి.
6. అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే సమీప పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
7. సైబర్ మోసం జరిగిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. ప్రజలు అప్రమత్తంగా ఉంటే ఇలాంటి మోసాలను నివారించవచ్చు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కుల్కచర్ల పోలీసులు కోరుతున్నారు.

# బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలి.

- **నారాయణపేట సీఐ శివశంకర్.**
- **నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**



**నారాయణపేట,09(సమయం న్యూస్):** బక్రీద్ పండుగ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ,అక్రమ పశువుల రవాణా నియంత్రణ, శాంతియుతంగా పండుగ జరుపుకోవాలని నారాయణపేట పోలీసు స్టేషన్ లో ఖురేషి (స్లాటర్ హౌస్ నిర్వాహకులు) ముస్లిం మత పెద్దల లతో నారాయణపేట సీఐ శివశంకర్,ఎస్సై వెంకటేశ్వర్లు శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ....బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. పశువుల కొనుగోలు, రవాణా,వధ ప్రక్రియల్లో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు,కోర్టు మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. రవాణా సమయంలో జంతువులకు సరైన సంరక్షణ కల్పిస్తూ మానవత్వంతో వ్యవహరించాలని, వాహనాల్లో అధిక సంఖ్యలో పశువులను ఎక్కించరాదని సూచించారు. తనిఖీల సమయంలో పోలీస్,వెటర్నరీ మరియు రవాణా శాఖ అధికారులకు సహకరించాలని తెలిపారు. చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా నకిలీ లేదా చెల్లని వెటర్నరీ సర్టిఫికెట్లు ఉపయోగించరాదని హెచ్చరించారు. అనుమతి లేని ప్రదేశాల్లో జంతువుల వధ,బహిరంగ ప్రదేశాల్లో మాంసం విక్రయాలు,ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా వ్యవహరించడం, సోషల్ మీడియాలో మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే పోస్టులు,వీడియోలు, ఫోటోలు షేర్ చేయడం వంటి చర్యలు చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అక్రమంగా పశువుల రవాణా,నిషేధిత జంతువుల వధ, అనుమతులు లేకుండా స్లాటర్ హౌస్ నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పండుగ సమయంలో ప్రజల మనోభావాలను గౌరవిస్తూ సామరస్య వాతావరణం నెలకొనేలా వ్యవహరించాలని ఖురేషి నిర్వాహకులకు సూచించారు. పరిశుభ్రత,పారిశుధ్య ప్రమాణాలు పాటించడంతో పాటు వ్యర్థాలను సరైన విధంగా నిర్వహించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి కార్యకలాపాలను ఉపేక్షించబోమని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో వెటర్నరీ డాక్టర్, ఎస్సై2 గాయత్రి, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- **నారాయణపేట ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య.**
- **ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 కి సమాచారం ఇవ్వాలి**
- **ట్రాఫిక్ ఎస్సై**



**నారాయణపేట, మే,09(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో శనివారం ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించి సరియైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధిస్తూ వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై కృష్ణ చైతన్య మాట్లాడుతూ... వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు సరైన పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. వాహనాలు నడిపే సమయంలో తప్పకుండా హెల్మెట్, సిట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపరాదు అని, రాష్ డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, త్రిబుల్ రైడింగ్ చేయరాదు, వాహనాలకు సంబంధించిన ఆర్సి, లైసెన్స్ ఇన్సూరెన్స్ తప్పకుండా కలిగి ఉండాలని ఎస్సై తెలిపారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించి పోలీసు వారికి సహకరించాలని ఎస్సై కృష్ణ చైతన్య తెలిపారు. అత్యవసర సమయంలో డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని కోరారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని వసతులు ఏర్పాటు చేయాలి

- **అధికారులకు ఆదేశించిన జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను**

**ధన్వాడ,మద్దూరు,గుండుమాల్ మండలం, మే,09(సమయం న్యూస్) :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని వసతులు ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ శ్రీను అధికారులను ఆదేశించారు. శనివారం ధన్వాడ మండలంలోని మందిపల్లి , అప్పంపల్లి మరికల్ మండలంలోని తీలేరు, మద్దూరు మండలంలోని పల్లె గడ్డ తాండ గుండుమాల్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సేకరించిన వరి ధాన్యాన్ని సకాలంలో రైస్ మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను నిల్వ చేసేందుకు షెడ్డు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే కొనుగోలు కేంద్రాలలో రైతులకు త్రాగునీరు సౌకర్యాలను చూశారు. ఆయా కేంద్రాల నిర్వహణ,టర్పాలిన్ల లభ్యత, అవసరమైన హమాలీలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గన్నీ బస్తాలు, ఇతర ఏమైనా తక్కువ అయితే వాటిని తెప్పించుకోవాలని కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జ్ లను ఆదేశించారు..



# మోడీ పర్యటన సందర్భంగా బీజేపీ జెండా ఆవిష్కరణ

- **ప్రధానమంత్రి నరేంద్ర మోడి తెలంగాణ పర్యటన సందర్భంగా మల్కాజ్గిరిలో బీజేపీ నాయకులు పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.**



**హైదరాబాద్ మే09( సమయం న్యూస్) :** మాజీ కార్పొరేటర్ శ్రవణ్ ఆధ్వర్యంలో ఆర్‌కే నగర్ శివపురిలో బీజేపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోడీ రేపటి పర్యటనలో దాదాపు రూ. 8 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఈ సభతో రాష్ట్రంలో బీజేపీ శక్తి మరింత పెరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ సభలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మురళి, సతీష్, మాధవ్, మల్లేష్, వీరేష్, ప్రవీణ్, శ్రీనివాస్, విజయకుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో శాంతి భద్రతలు క్షీణించాయి

- **ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్**

**హైదరాబాద్ మే09( సమయం న్యూస్). :** తెలంగాణలో గత 15 రోజులుగా శాంతిభద్రతలు క్షీణించాయని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, పోలీస్ శాఖ తూతూ మంత్రంగా పనిచేస్తోందని విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో మాజీ ఐపీఎస్ అధికారి భార్య హత్య, కరీంనగర్‌లో బంగారు దుకాణంలో చోరీ ఘటనలలో ఇప్పటివరకు నిందితులను పట్టుకోలేదని అన్నారు. అధికారులపై, ప్రజలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై నమోదైన కేసుల విషయంలో పోలీసులు ఒత్తిడికి లోనవుతున్నారని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. మైనర్ బాలిక ఫిర్యాదు విషయంలో సరైన సెక్షన్లు పెట్టలేదని, బాధిత కుటుంబానికి ప్రాణహాని ఉందని అన్నారు. ఈ కేసులో మేజిస్ట్రేట్ ముందు బాలిక స్టేట్‌మెంట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని, అవసరమైతే సీబీఐ విచారణ జరిపించాలని కోరారు. బండి సంజయ్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పెట్ బషీరాబాద్, కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ల సీసీటీవీ ఫుటేజ్‌ను భద్రపరచాలని అన్నారు. బీజేపీ సోషల్ మీడియా బాధిత కుటుంబంపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించిన ఆయన, "బేటీ బచావో" అంటూ నినాదాలు చేసే బీజేపీ నాయకులు ఈ ఘటనపై మాట్లాడాలని డిమాండ్ చేశారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతంగా పూర్తి చేయండి.

**ములుగు మే09( సమయం న్యూస్). :** యాసంగి( రబీ )2025-26 సీజన్ లో ములుగు జిల్లాలో ప్రారంభించిన 149 వరి ధాన్య కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ౹ాూజూ,×ఖూ, +జజ,ఫీూ నిర్వాహకులు సమర్ధవంతంగా కొనుగోలు జరపాలని బోర్కడే హేమంత్ సహదేవరావు సూచించారు. శనివారం రబీ 2025-26 ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో పొంచి ఉన్న అకాల వర్షాల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల ఆవశ్యకతను పునరుద్ఘాటిస్తూ, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ తరగతుల లో వివరించిన విధంగా అకాల వర్షాల నుండి ధాన్యాన్ని కాపాడుకోవడానికి సరైన పద్ధతిలో టార్పాలిన్స్ కప్పడంలో నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ధాన్య సేకరణ ప్రక్రియ నిర్వహించుట జరుపాలని, ధాన్యాన్ని తూర్పారాబట్టి ప్యాడి క్లీనర్ ఉపయోగించి ఫ్రూు ఆధారంగా వ్యవసాయ శాఖ అధికారుల నుండి టోకెన్ పొందిన తర్వాతనే కాంటాలు నిర్వహించాలని, లారీలలో లోడ్ చేసి మిల్లులకు పంపాలని ఈ విషయంలో ఎలాంటి అలసత్వం వహించకూడదని, ఏ విధమైన అలసత్వం వహించినను సంబంధిత సెంటర్ నిర్వాహకులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోబడునని సూచించారు. ధాన్య సేకరణలో సమస్యలు ఎదురవుతే పరిష్కారంకై ములుగు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో కంట్రోల్ రూం (9347416178) ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జీ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సయ్యద్ షా ఫైసల్ హుస్సైని, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల కార్పోరేషన్ ఎస్ కృష్ణవేణి, డీఆర్డీఏ పిడి చంద్రశేఖర్, డిప్యుటి తాహసిల్దార్ సివిల్ సప్లైస్ విజయ్ కుమార్, సంబంధిత శాఖల అధికారరులు పాల్గొన్నారు.

# కులగణనపై ప్రధాని స్పష్టత ఇవ్వాలి

**జాజుల శ్రీనివాస్ గౌడ్**

**హైదరాబాద్, మే 09( సమయం న్యూస్)** జాతి జనగణనలో సమగ్ర కులగణన చేపడతామని కేంద్ర క్యాబినెట్ హామీ ఇచ్చి, ప్రస్తుతం జరుగుతున్న జనగణనలో కులగణనను విస్మరించడం అన్యాయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ఈ అంశంపై నిరసనగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ పర్యటనకు రానున్న ప్రధాని నరేంద్ర మోదీ, బీసీల తరఫున అఖిలపక్ష బీసీ సంఘాలు సంధించిన పది ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో జరిగే బీజేపీ సభలో కేంద్ర క్యాబినెట్ నిర్ణయాన్ని అమలు చేస్తామని, బీసీ కులాలను లెక్కించి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచుతామని ప్రధాని ప్రకటించాలని కోరారు. గత 11 ఏళ్ల బీజేపీ పాలనలో బీసీ డిమాండ్లు నెరవేరలేదని ఆరోపించిన జాజుల శ్రీనివాస్ గౌడ్, ప్రజాస్వామ్యబద్ధంగా నల్లజెండాలతో శాంతియుత నిరసనలు చేపట్టాలని బీసీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీసీ కులగణన కోసం హైదరాబాద్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావుకు తమ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

# రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక (ఐఏఎస్).**





**నారాయణపేట మండలం, మే,09(సమయం న్యూస్) :** వరి కొనుగోలు కేంద్రాలలో లావాదేవీల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. శనివారం ఆమె నారాయణ పేట మండలం అప్పిరెడ్డి పల్లి గ్రామ సమాఖ్య ( ఐ కే పి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రానికి ఇంత వరకు ఎన్ని బస్తాల ధ్యానం వచ్చిందని ? గత సంవత్సరం క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అన్ని రికార్డుల నిర్వహణ సరిగ్గా ఉండాలన్నారు. కేంద్రం లో ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలతో పాటు ఇంకా ఎన్ని బస్తాల ధ్యానం విక్రయానికి వస్తుందో నిర్వాహకులు కలెక్టర్ కు వివరించారు. కేంద్రానికి చెందిన గన్ని బస్తాల స్టాక్ ను కలెక్టర్ పరిశీలించారు. ఒకరిద్దరు రైతులతో మాట్లాడి కేంద్రానికి ఎప్పుడు వచ్చారని ? తేమ శాతం వచ్చిందా లేదా అని వాకబు చేశారు.కొనుగోలు చేసిన బస్తాలను ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి బాల్ రాజ్, తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, డీటీలు కాళప్ప, నాగరాజు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జనగణనపై అవగాహన ర్యాలీ నిర్వహించిన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం మే 09( సమయం న్యూస్) :** ఖమ్మంలో జనగణనపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన వాక్ ర్యాలీని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈనెల 10 వరకు స్వీయ గణనలో ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని, మే 11 నుంచి ఇంటింటి గణన ప్రారంభమవుతుందని తెలిపారు.జనగణనలో ఇచ్చే వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంటాయని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. జనగణన ద్వారా ప్రభుత్వానికి ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఏర్పడి సంక్షేమ పథకాల అమలుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, విద్యార్థులు, క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

# రైతు తమ వివరాలను నమోదు చేసుకోవాలి



**అదిలాబాద్ మే09( సమయం న్యూస్) :** జిల్లాలోని రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ' లో తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఒక ప్రకటన తెలిపారు. ప్రభుత్వ పరంగా అందే వివిధ రకాల ప్రయోజనాలు, సేవలను పొందడానికి ఈ రిజిస్ట్రేషన్ ప్రాథమిక అర్హతగా ఉంటుందని, రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే వివిధ పథకాలు, రాయితీలతో పాటు, యూరియా బుకింగ్ వంటి అత్యవసర సేవలకు కూడా ఈ రైతు రిజిస్ట్రేషన్ నంబర్ అత్యంత కీలకం కానుందన్నారు. ఈ రిజిస్ట్రేషన్ లేని పక్షంలో రైతులు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, కావున ఏ ఒక్క రైతు కూడా ఈ ప్రక్రియను విస్మరించకూడదని సూచించారు. ఈ నేపథ్యంలో, ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటివరకు తమ పేర్లను నమోదు చేసుకోని రైతులు వెంటనే స్పందించి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని, అందుకు సమీపంలోని మీ-సేవ కేంద్రాల్లో గానీ లేదా తమ ప్రాంత వ్యవసాయ విస్తరణాధికారులను సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రీలో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, సకాలంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# 2వ వార్డు అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించండి

- ముఖ్యమంత్రికి మెమోరాండం అందించిన కౌన్సిలర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్
- 110 కోట్లతో శ్రీ మహాలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి చేస్తున్నందున....
- ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన కౌన్సిలర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్





**కొడంగల్ మున్సిపల్, మే,09(సమయం న్యూస్):** వికారాబాద్ జిల్లా కోడంగల్ పట్టణ కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి పునర్నిర్మాణ కోసం 110 కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కౌన్సిలర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. కోడంగల్ లోని వెంకటేశ్వర స్వామి పునర్నిర్మాణా శంకుస్థాపనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రెండో వార్డ్ కౌన్సిలర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ పలు సమస్యలతో కూడిన వినతి పత్రని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి అందించారు, కొడంగల్ పట్టణంలోని పురాతనమైన 'గడిబావి శివాలయం' ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందని, ఆలయ పునరుద్ధరణతో పాటు, ముందున్న గుండం (పవిత్ర కోనేరు) బాగు చేయాల్సిన అవసరం ఉందన్నారు,చకలోని బావి 6 బావుల సమాహారం కూడా శిథిలావస్థలో ఉందన్నారు. శివరాత్రి సమయంలో, మాలధారణ చేసే శివస్వాములతో సహా చాలా మంది భక్తులు ఈ ఆలయాన్ని సందర్శిస్తారని, పూజారి నివాసం, అన్నదానాల కోసం వంటగదితో కూడిన పెద్ద భోజనశాల,కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సుమారు రూ. 5.00 కోట్ల నిధులు మంజూరు చేయలన్నారు.బండల ఎల్లమ్మ బండ ఎల్లమ్మ ఆలయం నుండి తెలంగాణవాడి, కేజీబీవీ పాఠశాల మీదుగా గౌరారం రోడ్డు వరకు కొత్తగా నిర్మిస్తున్న రోడ్డుకు, సెంట్రల్ లైటింగ్ రూ. 1.00 కోటి అంచనాతో నిధులు మంజూరు చేయలన్నారు. బండ ఎల్లమ్మ ఆలయం, అయ్యప్ప స్వామి ఆలయాల పరిసరాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, లైటింగ్, తాగునీటి సౌకర్యం, కాంపౌండ్ వాల్స్ , పార్కుల అభివృద్ధికి సుమారు రూ. 2.00 కోట్ల నిధులు మంజూరు చేయలని కోరారు. కొడంగల్ పట్టణంలో సుమారు 35 శాతం జనాభా యాదవ సామాజిక వర్గానికి చెందినవారు ఉన్నారని ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నలుగురు యాదవ కౌన్సిలర్లు ఎన్నికయ్యారని జనాభా ఎక్కువ ఉన్నప్పటికీ, సరైన సౌకర్యాల లేమి వల్ల ఈ వర్గం వెనుకబడి ఉందని, యాదవ సామాజిక వర్గం కోసం ఒక కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలన్నారు, 133 కేవి సబ్-స్టేషన్ వెనుక భాగంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించి, రూ. 2.00 కోట్లు మంజూరు చేయలని కోరారు. ముదిరాజ్ కమ్యూనిటీ స్మశానవాటికను ఆక్రమణల నుండి రక్షించడానికి, కాంపౌండ్ వాల్ నిర్మించి, స్మశానవాటిక లోపల నీటి సౌకర్యం,మరుగుదొడ్లు, లైటింగ్, షెడ్ ఏర్పాటుకు రూ. 2.00 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి చేయాలన్నారు.సి.సి. రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, అంగన్‌వాడీ భవనాలు, సి.సి. కెమెరాలు , ఐమాక్స్ లైటింగ్ పనుల కోసం రూ. 11 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. చాలా మంది పేదరికం కారణంగా ఒకే గదిలో ఇబ్బంది పడుతున్నారని, ఈ వార్డు కోసం ప్రత్యేకంగా 100 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని విన్నవించారు.పార్కు ,శివాలయం , అయ్యప్ప స్వామి దేవాలయాల మధ్య ఉన్న 'వేద సిటీ' వంటి వెంచర్లలోని 10 శాతం ఖాళీ స్థలాన్ని పార్కు కోసం కేటాయించాలన్నారు. ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, ప్లే గ్రౌండ్ వంటి సౌకర్యాల కోసం రూ. 1 కోటి మంజూరు చేయాలని అభ్యర్థించారు.కొడంగల్‌లోని నిరుద్యోగ యువత కోసం స్థానికంగా ఏదైనా పరిశ్రమను ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని కోరారు. వినాయక చౌక్ నుండి కుమ్మరి వాడి వరకు ప్రతిపాదించిన 60 అడుగుల రోడ్డు విస్తరణ వల్ల పేదల ఇళ్లు దెబ్బతింటాయని, వారికి రెట్టింపు నష్టపరిహారం ఇవ్వాలని లేదా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని విస్తరణ పరిమితిని తగ్గించాలని పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందిస్తూ ఇచ్చిన సమస్యలకు నిధులు కేటాయించి వార్డు అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# ప్రజాదర్బార్ దరఖాస్తులకు 3 నెలల్లో పరిష్కారం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**తిరుమలాయపాలెం, మే 09( సమయం న్యూస్) :** ప్రజా దర్బార్‌లో నమోదయ్యే ప్రతి దరఖాస్తును మూడు నెలల్లోపు పరిష్కరించేలా కార్యాచరణ సిద్ధం చేశామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.శనివారం తిరుమలాయ-పాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. పాలేరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 14,700 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో ఇందిరమ్మ ఇళ్లు, భూ సమస్యలు, పింఛన్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు మే నెలాఖరు నుంచి ప్రారంభమవుతుందని మంత్రి వెల్లడించారు. ధరణి సమస్యల పరిష్కారానికే భూ భారతి తీసుకువచ్చామని, సాదా బైనామా దరఖాస్తులను కూడా పేదలకు భరోసా కలిగేలా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.రైతులు పండించిన ధాన్యం, మొక్కజొన్నను ప్రతి గ్రామంలో ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్, రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేల పంట సహాయం అందిస్తున్నామని చెప్పారు.అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాదర్బార్‌లో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కార చర్యలు చేపడుతున్నామని తెలిపారు.కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 'రైతు వారోత్సవాలలో' భాగంగా సాత్నాల ప్రాజెక్ట్ కాలువల పూడికతీత పనులను ప్రారంభించిన కలెక్టర్ రాజర్షి షా





**అదిలాబాద్ మే09( సమయం న్యూస్) :** రైతు వారోత్సవాల ద్వారా సాగునీటి రంగంలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' రైతు వారోత్సవాల్లో భాగంగా నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సాత్నాల మండల కేంద్రంలోని ప్రాజెక్టు కుడి కాలువ పరిధిలోని మేడిగూడ- సి కెనాల్ వద్ద పూడికతీత పనులను ఆయన ముఖ్య అతిథిగా హాజరై పూజ కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 4 నుండి మే 9 వరకు నిర్వహిస్తున్న ఈ రైతు వారోత్సవాల ద్వారా సాగునీటి రంగంలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాత్నాల ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం 3.6 కిలోమీటర్ల పొడవున్న కుడి ప్రధాన కాలువలో, ప్రస్తుతం 1.5 కిలోమీటర్ల మేర పూడికతీత, కంప చెట్ల తొలగింపు పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా సాగునీటి కాలువలు, చెరువుల్లో పూడికతీత పనులు, కంప చెట్ల తొలగింపును ముమ్మరంగా చేపట్టడం జరుగుతుందన్నారు. ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు నిర్వహించి, పంట పొలాలకు సక్రమంగా నీరు అందేలా గేట్ల నిర్వహణను పర్యవేక్షిస్తారన్నారనీ వివరించారు. ఉపాధి హామీ కింద సుమారు 3000 మ్యాన్ డేస్ లక్ష్యంతో ఈ పనులు జరుగుతున్నాయని, దీనివల్ల ఆయకట్టు చివరి వరకు సాగునీరు సక్రమంగా అందుతుందన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా కూలీల సౌకర్యార్థం పని ప్రదేశాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కూలీలు ఉదయం పనులకు వచ్చేలా మోటివేట్ చేయాలని, వారికి తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ కోసం టెంట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.అనంతరం సాత్నాల ప్రాజెక్టును కలెక్టర్ పరిశీలించి, మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ. 69 లక్షల నిధులను మంజూరు చేసిందని, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో నీటిపారుదల



శాఖ ఈఈ ఉమామహేశ్వరరావు, డీఈ శ్రీనివాసరావు, ఏఈ మహేష్, ఎంఆర్ఓ రామారావు, ఎంపిడిఓ వెంకట్ రాజు, ఏపీఓ వెంకట రమణ, సర్పంచ్ అంజనా బాయి, ఇతర అధికారులు, కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

- ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియపై దృష్టి సారించాలి
- విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు.



**నారాయణపేట, మే,09(సమయం న్యూస్) :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, సెన్సస్, విద్యా వారోత్సవాలపై శనివారం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ అన్ని జిల్లాలలో వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ కు ఒక్క రోజే మిగిలి ఉండడంతో ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో పది లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, వీరంతా స్వీయ గణన చేసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 11వ తేదీ నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సిఎస్ సూచించారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక వీసీలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యా వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బాల్ రాజ్, జిల్లా మేనేజర్ సైదులు , జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, డి ఈ ఓ గోవింద రాజులు, అధికారులు రాజేంద్ర ప్రసాద్, యాదయ్య శెట్టి పాల్గొన్నారు.

# నేడు హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభలో ప్రధాని మోదీ బీసీలపై స్పష్టమైన ప్రకటన చేయాలి

- బీసీ కుల గణనపై కేంద్రం సానుకూల నిర్ణయం ప్రకటించాలి,
- జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్



**తాండూర్, మున్సిపల్ మే,09(సమయం న్యూస్) :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 10వ తేదీన తెలంగాణ రాష్ట్ర పర్యటనకు రానున్న నేపథ్యంలో బీసీల న్యాయబద్ధమైన హక్కుల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు, తాండూర్ బీసీ సంఘం కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. శాసనసభలు, స్థానిక సంస్థలు మరియు ఇతర ఎన్నికల వ్యవస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు ప్రత్యేక సబ్‌కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని సూచించారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా బీసీ కుల గణనపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం ప్రకటించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్లకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని రాజ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. బీసీ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ దేశాన్ని నడిపించడం గర్వకారణమని పేర్కొన్న ఆయన, నేడు హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభలో తెలంగాణ బీసీలకు రాజకీయ రిజర్వేషన్లపై స్పష్టమైన హామీ ఇవ్వాలని రాజ్ కుమార్ కోరారు.

## రాజకీయాల్లో ఎదగాలని ఆకాక్షించే వారికి పవర్ ప్లే పుస్తకం ఎంతగానో దోహదం చేస్తుంది

-రాజకీయ వ్యూహకర్త, రచయిత రమాకాంత్ రావినూతల.

- రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టీసీసీఐలో పవర్ ప్లే పుస్తకావిష్కరణ కార్యక్రమం



**సుల్తాన్‌బజార్,మే 9.** బూత్ స్థాయి కార్యకర్తల నుండి రాష్ట్ర స్థాయి నాయకుల వరకు రాజకీయాల్లో ఎదగాలని ఆకాక్షిం చే వారికి పవర్ ప్లే పుస్తకం ఎంతగానో దోహదం చేస్తుందని రాజకీయ వ్యూహకర్త,రచయిత రమాకాంత్ రావినూతల పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం రెడ్‌హిల్స్ ఎఫ్‌టీసీసీఐలోని సురానా ఆడిటోరియంలో ఆయన రచించిన ప్రజల నుం చి పీఠం వరకు అనే నినాదంతో పవర్ ప్లే పుస్తకాన్ని కంటెంట్ పర్యవేక్షకులు,మోటివేషనల్ స్పీకర్ శ్రీపాదరామ్ మదునూరితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ జెండా మోసే కార్యకర్తలు రాజకీయంలో ఎదగలేక రాజకీయాల నుండి తప్పుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బూత్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎదగాలనే ఉద్దేశ్యంతో దేశంలో ఇప్పటి వరకు ఎవ్వరూ రచించని పుస్తకాన్ని తొలిసారి నాయకత్వాన్ని నిలబెట్టే మూడు స్థంభాలు ఇన్నర్ సర్కిల్, మెం టర్,కార్యకర్తలు పూర్తి స్థాయి వివరణతో పవర్ ప్లే పుస్తకాన్ని రూపొందించడం జరిగింద ని అన్నారు. గత 15 సంవత్సరాలుగా ఎన్నికల రాజకీయాల్లో,సుమారు 60 అసెంబ్లీ,9 పార్లమెంట్ నియోజకవర్గాల్లో వ్యూహకర్త గా పని చేసి అనేక అభ్యర్థుల విజయాల్లో తన వంతు పాత్ర పోషించిన అనుభవంతో 16 పుస్తకాలను రచించ డం జరిగిందని అన్నారు. రాజకీయ వ్యూహం,ఎన్నికల ప్రచారాలు,నాయకత్వం వంటి విభాగాల్లో అత్యధిక పు స్తకాలు రాసిన ఏకైక రచయితగా భారతదేశంలో గుర్తింపు పొందడం విశేషం. రాజకీయాల్లో వ్యూహకర్తగా ఎద గాలనే ఆకాంక్ష ఉన్న వారికి ఈ పుస్తకాలు మార్గదర్శకాలుగా నిలుస్తాయని అన్నారు. కంటెంట్ పర్యవేక్షకులు, మోటివేషనల్ స్పీకర్ శ్రీ పాదరామ్ మదునూరి మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాల్లోకి యువత అడుగు పెట్టా ల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. విఫలం అనేది అంతం కాదని,అది కొత్త ఆరంభానికి అవకాశం అనేది తన నమ్మకమని అన్నారు. రాజకీయ రం గంలోనూ,వ్యాపార రంగంలోనూ,వ్యక్తిగత జీవితాల్లోనూ వేలా ది మందిని ప్రేరేపించిందని అన్నారు. రచయిత రమా కాంత్ రావినూతల రచించిన పవర్ ప్లే పుస్తకంతో కార్య కర్తల నుండి రాజకీయ నాయకులుగా ఎదగేందుకు ఎంతగానో తోడ్పాటును అందిస్తుందని అన్నారు. చదువులేని వారు రాజకీయాల్లో ఏలుతున్నారని,గ్రాడ్యుయేట్స్ అయిన వారు రాజకీయాల్లోకి రావాల్సిన సమయం ఆసన్నైమెందని అన్నారు. సమాచార సాంకేతిక రంగంలో దశాబ్దం పాటు అను భవనం కలిగిన తాను రేటి యువత రాజకీయాల్లో ఎదిగేందుకు ఆసక్తి ఉంటే శిక్షణ ఇస్తానని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో నికీలు గుండా,సీఎల్ చంద్రశేఖర్,కుమార్,రామ్ కళ్యాణ్,కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## కోట్లాది కుటుంబాలకు బీమా, పెన్షన్ భరోసా

**న్యూ డిల్లీ మే09( సమయం న్యూస్). :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మూడు ప్రధాన జనసురక్ష పథకాలు --- ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్బీవై), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) విజయవంతంగా 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాయి. 2015 మే 9న ప్రధానమంత్రి ఛ్మీతీవఅనతీ్ఖ వీశీఱ ఈ పథకాలను ప్రారంభించారు. కేంద్ర ఆర్థిక మంత్రి చీఱతీఝశ్రీఃూ రాఝష్ట్ఖుతీఝుఝఅ వెల్లడించిన వివరాల ప్రకారం, పీఎంజేజేబీవై కింద ఇప్పటివరకు 27.43 కోట్లకు పైగా నమోదు కాగా, 10.75 లక్షల క్లెయిమ్‌లకు రూ.21,512 కోట్లకుపైగా చెల్లింపులు జరిగాయి. పీఎంఎస్బీవై కింద 58.09 కోట్లకు పైగా నమోదు నమోదై, 1.84 లక్షల క్లెయిమ్‌లకు రూ.3,667 కోట్లకుపైగా పరిహారం అందించారు. అటల్ పెన్షన్ యోజనలో 2026 ఏప్రిల్ 30 నాటికి 9.04 కోట్లకు పైగా ప్రజలు చేరారు. అసంఘటిత రంగ కార్మికులకు వృద్ధాప్యంలో నెలవారీ పెన్షన్ భరోసా కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ సందర్భంగా కేంద్ర సహాయ ఆర్థిక మంత్రి ాఝఅఝయి జష్ట్ఖుబఎష్ట్ఖుతీఎ మాట్లాడుతూ, డిజిటల్ విధానాల ద్వారా నమోదు, క్లెయిమ్‌ల పరిష్కారం మరింత సులభమైందని తెలిపారు.

## .ప్రధానమంత్రి కార్యక్రమాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం



**హైదరాబాద్ మే09( సమయం న్యూస్). :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించనున్న పలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవం, హైదరాబాద్-పనాజీ ఎకానమిక్ కారిడార్‌లోని గుడెబల్లూర్-మహబూబ్‌నగర్ నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన, కాజీపేట-విజయవాడ మల్టీ ట్రాకింగ్ పనులను హైదరాబాద్ హెచ్ఐసీసీ వేదికగా ప్రధానమంత్రి ఆదివారం వర్చువల్‌గా చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలంటూ కేంద్ర ప్రభుత్వం తరఫున జాతీయ రహదారుల శాఖ రీజినల్ ఆఫీసర్ కృష్ణప్రసాద్ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు.

## నీతి ఆయోగ్ నుండి ఆదిలాబాద్ జిల్లాకు రూ. 4.29 కోట్ల నిధుల మంజూరు

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**అదిలాబాద్ మే09( సమయం న్యూస్). :** ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన ప్రాంతాల అభివృద్ధి, రైతుల ఆర్థికాభివృద్ధి కోసం జిల్లా యంత్రాంగం పంపిన ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం నుండి సానుకూల స్పందన లభించిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. నీతి ఆయోగ్ 'విండో-II' ఇన్నోవేషన్ కేటగిరీ కింద జిల్లా నుండి నాలుగు ప్రాజెక్టులను ప్రతిపాదించగా, అందులో రెండు ముఖ్యమైన ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని, వీటికి రూ. 4.29 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఆయన వెల్లడించారు. అందులో మొదటి ప్రాజెక్టుగా నార్నూర్ బ్లాక్‌లోని 20 గ్రామాలకు చెందిన 370 గిరిజన కుటుంబాలకు లబ్ధి చేకూర్చే 'లక్క సాగు అభివృద్ధి' ప్రాజెక్టు. దీని కోసం రూ. 0.40 కోట్లు కేటాయించబడ్డాయినీ, ఈ ప్రాజెక్టు ద్వారా గిరిజనులకు శాస్త్రీయ పద్ధతుల్లో లక్క సాగుపై శిక్షణ ఇచ్చి, వారి జీవనోపాధిని మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యమని వివరించారు. అడవిపై ఆధారపడి జీవించే కుటుంబాలకు ఇది అదనపు ఆదాయ వనరుగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రెండవ ప్రాజెక్టుగా రూ. 3.89 కోట్లతో 'వాడీ సాగు, 3-అంచెల సమీకృత వ్యవసాయం' చేపట్టనున్నట్లు తెలిపారు. నార్నూర్ ప్రాంతంలోని 286 మంది సన్నకారు రైతులకు ఉద్యానవన పంటలు, కూరగాయలు, టేకు సాగు ద్వారా స్థిరమైన ఆదాయం కల్పించడం ఈ పథకం ఉద్దేశ్యమని, జిల్లా నుండి పంపిన 4 ప్రాజెక్టులలో ఈ రెండు కీలకమైనవి ఎంపిక కావడం జిల్లా అభివృద్ధికి దోహదపడతాయని, ఈ నిధులను సక్రమంగా వినియోగించి రైతుల ఉపాధిని మెరుగుపరుస్తామని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఈనెల 11 వ తేదీ నుండి విద్యా వారోత్సవాలు



**హైదరాబాద్, మే 9:( సమయం న్యూస్) :** 99 రోజుల ప్రజా పాలన్ ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11 వ తేదీ నుండి నిర్వహించేంచే విద్యా శాఖ వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. విద్యా వారోత్సవాల నిర్వహణపై సంబంధిత ఉన్నతాధికారులతో కలసి జిల్లా కలెక్టర్లతో నేడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్బంగా కలెక్టర్లతో సి ఎస్ మాట్లాడుతూ ఈ నెల 11 న ఎల్ బి స్టేడియం లో నిర్వహించనున్న విద్యావారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు బారి సంఖ్యలో హాజరయ్యేలా కలెక్టర్లు చొరవతీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు . విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టే వారోత్సవాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను , రోజువారీ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్లకు విద్యాశాఖ ఉన్నతాధికారులు వివరించారు. అంతకుముందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ కి సంబంధించిన పురోగతి, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లు, జనాభా స్వీయ గణన కు సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సి ఎస్ జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ వీడియొ కాన్ఫరెన్స్ లో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రానా , కళాశాల విద్యా శాఖ కమీషనర్ దేవసేన, పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ , పౌర సరఫరాల శాఖ కమీషనర్ స్టీఫెన్ రవీంద్రతదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఘనంగా రైతు వారోత్సవాలు

**హైదరాబాద్ మే09( సమయం న్యూస్). :** హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక"లో భాగంగా మే 4 నుంచి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా రైతు వారోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, నేల ఆరోగ్యం, మార్కెటింగ్, యాంత్రీకరణ, పశుసంవర్ధక, నీటిపారుదల అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. వికారాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు వారం కార్యక్రమాలను ప్రారంభించి టీజీ ఆర్గానిక్స్ యాప్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా మట్టి నమూనాల సేకరణ, విశ్లేషణ పత్రాల పంపిణీ చేపట్టారు. హనుమకొండలో నిర్వహించిన మెగా రైతు మేళాలో ఆయిల్ పామ్, ప్రత్యామ్నాయ పంటలు, బిందు సేద్యం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ యంత్రాలు, డ్రోన్ సాంకేతికత, సౌర విద్యుత్ పథకాలపై రైతులకు అవగాహన కల్పించగా, పంట రుణాలు, కనీస మద్దతు ధర, మార్కెటింగ్ సదుపాయాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. రైతుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించి వ్యవసాయ ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

## 12 నుంచి 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పని వేళలు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

**హైదరాబాద్ మే 09( సమయం న్యూస్) :** భూముల ధరల సవరణ నేపథ్యంలో రిజిస్ట్రేషన్లకు డిమాండ్ పెరగడంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అధిక రద్దీ ఉన్న 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెల 12 నుంచి ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు పని వేళలు పొడిగిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, గం డిపేట్, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్‌బీనగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ ఆర్ఓ, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్ కార్యాలయాల్లో ఈ అదనపు వేళలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. అవసరమైతే మరింత సమయం పెంచడంతో పాటు స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను కూడా పెంచాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉన్న ఇతర కార్యాలయాలను గుర్తించి అక్కడ కూడా అదనపు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రేషన్ల ఐజీని ఆదేశించారు.

## చెరువులను పరిరక్షించుకోవాలి

--జిల్లా అదనపు కలెక్టర్ నగేష్





**మెదక్ మే 09( సమయం న్యూస్) :** చెరువులను పరిరక్షించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్ అన్నారు. శనివారం మెదక్ మండలంలోని కోముటూరు చెరువు కట్టపై ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చెరువుల పరిరక్షణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, కార్యక్రమం ద్వారా చెరువుల పరిరక్షణ, పూడిక తీత, ముల్లా చెట్ల పొదల తొలగింపు, ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. చెరువు బాగుంటేనే ఊరు బాగుంటుందని, చెరువు ద్వారా పంటలు పండి గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని అన్నారు. నీటిపారుదల శాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. చెరువులను కాపాడుకొని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు అన్నారు. చెరువులను అక్రమాల నుండి, కాలుష్యం నుండి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ తాహాసిల్దార్ లక్ష్మణ్ బాబు, నీటిపారుదల శాఖ అధికారులు, స్థానిక సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆందోల్ లోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ రంగనాథ స్వామి రథోత్సవంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు.



**ఆంధోల్ మే09( సమయం న్యూస్) :** శ్రీ రంగనాథ స్వామి రథోత్సవం కన్నుల పండుగగా సాగింది. మంత్రి దామోదర్ రాజనర్సింహ స్వామివారి రథోత్సవ కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు. భక్తులతో పాటు శ్రీ రంగనాథ స్వామి నామస్మరణ చేసుకుంటూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## స్వీయ జనగణనలో ఒక్క రోజే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేయాలని

జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల



**హైదరాబాద్ మే09( సమయం న్యూస్) :** 2027 జనగణనలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా స్వీయ గణన చేసుకునేందుకు ఈ నెల 10వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉన్నదని తెలిపారు. ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకునే ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. https://se. census. gov.in అనే వెబ్‌సైట్ ద్వారా ఇంటి వద్ద నుండే సులభంగా స్వీయ గణన నమోదు చేసుకోవాలని అన్నారు. మొబైల్ ఫోన్ ద్వారానే ఈ ప్రక్రియ పూర్తి సులభంగా నమోదు చేయవచ్చని, నచ్చిన భాషను ఎన్నుకొని వివరాలు నమోదు చేయాలని తెలిపారు. గత నెల 26వ తేదీ నుండి ప్రారంభమైన స్వీయ గణన ఆన్లైన్ నమోదు కార్యక్రమం ఈ నెల 10వ తేదీతో ముగుస్తుందని స్పష్టంచేశారు. జనగణన ప్రక్రియలో భాగంగా స్వీయ గణన, అనంతరం గృహాల లెక్కింపు, తదుపరి పూర్తి జనగణన నిర్వహిస్తారని వివరించారు. ఈ నెల 11వ తేదీ నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి హౌస్ లిస్టింగ్ చేపడతారని తెలిపారు. దేశ ప్రణాళిక, భవిష్యత్ అభివృద్ధి, వనరుల పంపిణీకి జనగణన కీలకమని కలెక్టర్ తెలిపారు. అద్దె ఇళ్లలో నివసిస్తున్నవారు కూడా తమ ప్రస్తుత నివాసం నుండే వివరాలు నమోదు చేసుకోవచ్చని సూచించారు. జనగణన సందర్భంగా అందరూ తమ కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలను ఖచ్చితంగా అందించాలని కోరారు. ఈ వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, జనాభా లెక్కలకు మాత్రమే ఉపయోగించబడతాయని స్పష్టం చేశారు. ఆన్లైన్ నమోదు తదుపరి ఎన్యుమరేషన్ ఐడి వస్తుందని, అట్టి నంబర్ ఆధారంగా ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని తెలిపారు. ఒక్క రోజే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలందరూ స్వీయ గణనలో పాల్గొనాలని ఆయన సూచించారు.

# నిమ్జ్ అభివృద్ధి పనులలో వేగం పెంచాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
- మౌలిక సదుపాయాలు, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని
- అధికారులకు మరియు కాంట్రాక్టర్ కి ఆదేశాలు.
- నిమ్జ్ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష





**సంగారెడ్డి, మే 09( సమయం న్యూస్). :** జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ (నిమ్జ్ ) పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. అవసరమైన యంత్రాలు, ఎక్విప్మెంట్‌ను పెంచి ఇన్ఫ్రాస్ట్రక్చర్ వర్క్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మౌలిక వసతుల ఏర్పాట్లలో ఎలాంటి జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శనివారం కలెక్టర్ జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వీరారెడ్డి తో కలిసి జహీరాబాద్ రెవెన్య డివిజనల్ అధికారి కార్యాలయంలో నిమ్జ్, పరిధిలోని భూముల అభివృద్ధి, సేకరించిన భూముల ప్రస్తుత స్థితి, పెండింగ్ సమస్యలు, స్వాధీనం చేసుకున్న భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు తదితర అంశాలపై టీజీఐఐసీ, నిమ్జ్, రెవెన్యూ మరియు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు నిమ్జ్ భూముల మ్యాప్‌ను పరిశీలించిన కలెక్టర్, ఇప్పటివరకు సేకరించిన భూములు, ఇంకా సేకరించాల్సిన భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియలో ఎదు-రవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించి పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తిచేయాలని తెలిపారు. సేకరించిన భూమిలో చుట్టు పూర్తి స్థాయిలో ఫెన్సింగ్ వేయాలని సూచించారు. ఈ సమావేశంలో టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీరారెడ్డి, జోనల్ మేనేజర్ విఠల్, నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశాలాక్షి, రెవెన్యూ డివిజనల్ అధికారి దేవూజ, సంబంధిత మండలాల తహసీల్దార్లు, పోలీస్ శాఖ అధికారులు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మంత్రి దామోదర్ రాజనర్సింహ







**ఆంధోల్ మే09( సమయం న్యూస్) :** ఆందోల్ నియోజకవర్గ పర్యటనలో రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ విద్య, వైద్యం, మహిళా సాధికారత, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి ూా. =వఝుత్ష్ట =వసఎఎ నాయకత్వంలో మహిళలు, శిశువులు, వృద్ధులు, వికలాంగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అంగన్వాడీలను కాపాడుకోవడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేసిన మంత్రి, రాష్ట్రంలో అంగన్వాడి కేంద్రాల బలోపేతానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు అంగన్వాడి కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

మెదక్ జిల్లా అల్లాదుర్గ్, రేగోడ్, టేక్మాల్, శంకరంపేట (ూా) మండలాలకు చెందిన 220 మంది అంగన్వాడి టీచర్లకు స్థానిక ఎంపీ ూబతీవంష్ట ూష్టవ్ఝుతీ తో కలిసి స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం, టీకాలు, ఆరోగ్య పరీక్షలు, ప్రీ-స్కూల్ విద్య వంటి సేవలను అంగన్వాడీల ద్వారా ఉచితంగా అందిస్తున్నామని మంత్రి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మార్పు తీసుకురావడంలో ఏఎన్ఎంలు, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొప్పుల లక్ష్మీ శేషారెడ్డి, ఆర్డీఓ రమాదేవి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి, సీడీపీఓ పద్మలత, ఐసీడీఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లుల్లో అగ్నిమాపక భద్రత అవగాహన కార్యక్రమాలు





**కరీంనగర్ మే09( సమయం న్యూస్). :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లాలోని 5 అగ్నిమాపక కేంద్రాల అధికారులు, సిబ్బంది తమ పరిధిలో ఉన్న రైస్ మిల్లులు, పరిశ్రమల్లో అగ్నిప్రమాదాల నివారణపై శనివారం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది రైస్ మిల్లుల యజమానులు, కార్మికులకు అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో పాటించాల్సిన భద్రతా చర్యలపై వివరించారు. రైస్ మిల్లుల్లో విద్యుత్ వైరింగ్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం, షార్ట్ సర్క్యూట్‌ల నివారణకు చర్యలు తీసుకోవడం, ఫైర్ ఎక్స్టింగ్విషర్లు అందుబాటులో ఉంచడం, అత్యవసర నిష్క్రమణ మార్గాలను సక్రమంగా నిర్వహించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా, అగ్నిప్రమాదం సంభవించినప్పుడు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడం, ప్రారంభ దశలోనే మంటలను అదుపు చేసే విధానాలపై ప్రత్యక్షంగా డెమో నిర్వహించారు. జిల్లాలోని ప్రతి పరిశ్రమలో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, అప్రమత్తతే ప్రమాద నివారణకు కీలకమని అధికారులు సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణే అగ్నిమాపక శాఖ ప్రధాన లక్ష్యమని వారు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌మానకొండూరు ఇన్చార్జ్ ఫైర్ ఆఫీసర్ సంతోష్ హుజురాబాద్ ఇన్చార్జ్ అధికారి సురేందర్ చొప్పదండి ఇన్చార్జ్ అధికారి లక్ష్మారెడ్డి జమ్మికుంట ఇన్చార్జి ఫైర్ ఆఫీసర్ రాజా వెంకటరెడ్డి ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జన గణన 2027 స్వీయ గణన ద్వారా వివరాలు నమోదు చేసుకున్న జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా .

## మే 10 వరకు స్వీయ గణన చేసుకునేందుకు అవకాశం



**మహబూబ్ నగర్ మే09( సమయం న్యూస్) :** స్వీయ గణన లో అధిక సంఖ్యలో ప్రతి ఒక్కరూ పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపు జన గణన 2027 లో భాగంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శనివారం తన క్యాంపు కార్యాలయంలో స్వీయ గణన లో పాల్గొని లాప్ టాప్ ద్వారా వివరాలు నమోదు చేసుకున్నారు. జన గణనలో ఎవరికి వారు స్వయంగా వివరాలు నమోదు చేసుకునేలా అందుబాటులోకి తెచ్చిన ఆన్ లైన్ వెబ్ సైట్ https://se.census.gov.in ద్వారా తన వివరాలను నమోదు చేసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జన గణన ప్రక్రియను సులభంగా, సమగ్రంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం డిజిటల్ స్వీయ గణన (ణఅస్త్ర-ఖ్షుశ్రీ రావశ్రీట-జుఅబఎవతీఫ్ఆశీఅ) విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. ఆన్లైన్ ద్వారా ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ వివరాలను వెబ్ పోర్టల్ లో కానీ , మొబైల్ యాప్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారని కలెక్టర్ తెలిపారు. మే 10వ తేదీ వరకు స్వీయ గణన చేసుకునేందుకు అవకాశం ఉందని, స్వీయ గణన ప్రతి ఒక్కరూ పాల్గొని వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. జన గణనకు సంబంధించిన సమాచారాన్ని 15 నిమిషాల వ్యవధిలో పూర్తి చేసుకోవచ్చని అన్నారు. వివరాలు నమోదు చేసిన అనంతరం ప్రత్యేకమైన సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి (రాజు×ణ) జారీ చేయబడుతుందని తెలిపారు. ప్రభుత్వంచే నియమించబడిన ఫీల్డ్ ఎన్యుమరేటర్లు మే 11 నుంచి జూన్ 09వ తేదీ మధ్యకాలంలో క్షేత్రస్థాయిలో ఇంటికి వచ్చిన సమయంలో వారికి సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐ.డి నెంబర్ తెలియజేయాలని సూచించారు. ప్రజలు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన సమాచారాన్ని సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐ.డి ద్వారా ఎన్యూమరేటర్ పరిశీలించి ధృవీకరిస్తారని అన్నారు. దీనివల్ల ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాల్లో ఉండే వారు, విద్యార్థులు, వలస కార్మికులు, ప్రయాణాల్లో ఉన్న ప్రజలు కూడా జనగణనలో వివరాలు నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారని కలెక్టర్ తెలిపారు. అయితే, స్వీయ గణనలో ఖచ్చితమైన చిరునామా, సరైన వివరాలు నమోదు చేసుకోవాలని అన్నారు. జనగణన ప్రక్రియలో సాంకేతికతను వినియోగించి సమగ్రతను పెంచడం, ప్రతి పౌరుడి వివరాలు జన గణనలో చేరేలా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన డిజిటల్ స్వీయ గణన ప్రక్రియను జిల్లాలోని ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రతి ఒక్కరి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని భరోసా కల్పించారు. దేశ అభివృద్ధి ,ప్రణాళికల రూపకల్పనలో ఎంతగానో దోహదపడే జన గణనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, జిల్లాలో ఈ ప్రక్రియ విజయవంతం అయ్యేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

# ధాన్యం సేకరణను వేగవంతం చేయాలి.

## సమిష్టి కృషితో విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి.

## కలెక్టర్ ఇలా త్రిపాఠి.




**నిజామాబాద్ మే 09( సమయం న్యూస్). :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, జనాభా గణన, విద్యా వారోత్సవాలపై శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ అన్ని జిల్లాలలో వంద శాతం పూ-ర్తయ్యేలా చూడాలన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ కు ఒక్క రోజే మిగిలి ఉండడంతో ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో పది లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, వీరంతా స్వీయ గణన చేసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని సిఎస్ దిశా నిర్దేశం చేశారు. వీ.సీ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు కీలక సూచనలు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్రాలకు రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే, నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉంటే వెంటనే తూకం జరిపించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే నిర్దేశిత రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు. ధాన్యం లోడింగ్ అన్ లోడింగ్ లో జాప్యం జరగకుండా సరిపడా సంఖ్యలో హమాలీలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, వారికి భోజన సౌకర్యం కల్పించాలని కలెక్టర్ సూచించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, వాతావరణ పరిస్థితుల గురించి రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. జనాభా గణన ప్రక్రియలో భాగంగా కొనసాగుతున్న స్వీయ నమోదును అన్ని వర్గాల వారు స్వీయ గణన చేసుకునేలా కృషి చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో అంగన్వాడీ, ఆశా వర్కర్లను కూడా భాగస్వాములు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువు లోపు జిల్లాలో అత్యధిక మంది స్వీయ గణన పూర్తి చేసుకునేలా చొరవ చూపాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టనున్న విద్యా వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని, విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ బడులపై ఆసక్తిని పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీ జిల్లాలో వంద శాతం పూర్తయ్యేలా చొరవ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ప్రవీణ్, డీఆర్డీఓ సాయన్న, డీఏఓ వీరస్వామి, డీఈఓ అశోక్, డీసీఓ శ్రీనివాస్, ఏఎస్ఓ అరవింద్ రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి

**: కేటీఆర్**

**హైదరాబాద్ మే09( సమయం న్యూస్).**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో శాంతిభద్రతలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయని భారత్ రాష్ట్ర సమితి (దీ=ూ) వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కెటిఆర్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న ఘోరమైన నేరాల పట్ల కేటీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ యంత్రాంగం మొత్తాన్ని రాజకీయ కక్షసాధింపులు, ప్రతిపక్ష నాయకులను వేధించడం కోసమే మళ్లించడం వల్లే.. ప్రజల రక్షణ, భద్రత గాలిలో కలిసిపోయిందని ఆయన విమర్శించారు. ఈ మేరకు రాష్ట్రంలోని పరిస్థితుల పైన సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ లో పోస్ట్ చేశారుశాంతిభద్రతల క్షీణతపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తున్న సమయంలోనే.. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే హైదరాబాద్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య అత్యంత దారుణంగా హత్యకు గురైన వార్త రావడం దిగ్భ్రాంతికరమని కేటీఆర్ పేర్కొన్నారు. అంతేకాకుండా, నిన్న రాత్రి సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై ఒక యువకుడిని అతి దారుణంగా కత్తితో పొడిచి చంపిన ఘటన నగరాన్ని ఉలిక్కిపడేలా చేసిందని, ఇది సామాన్య పౌరుల్లో పెరుగుతున్న అభద్రతా భావానికి అద్దం పడుతోందని ఆయన అన్నారు. నేరాల నివారణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టాల్సిన పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను.. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రభుత్వ తీరును విమర్శించే సోషల్ మీడియా గొంతులపై అక్రమ కేసులు బనాయించేందుకు వాడుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు.

"పోలీస్ వ్యవస్థను రాజకీయ కక్షసాధింపు చర్యలకు వాడుకోవడం వల్లనే శాంతిభద్రతలు కుప్పకూలాయని " అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణలో మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు భారీగా పెరిగినట్లు తాజా ఎన్‌సీఆర్‌బీ (చీజ=దీ) నివేదికలు చెబుతున్నాయని, ఇది ప్రస్తుత ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని ఆయన గుర్తుచేశారు. హోం శాఖను కూడా తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ప్రజల ఆస్తిపాస్తులను, ప్రాణాలను రక్షించడంలోనూ, శాంతిభద్రతలను కాపాడటంలోనూ ఘోరంగా విఫలమయ్యారని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రాజకీయ వేధింపులు ఆపి, పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రజల్లో భరోసా కల్పించేలా వృత్తిపరంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# రైతులు ఆందోళన చెందవద్దు..

## ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

## వేగవంతంగా కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ : జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీం నగర్ మే09( సమయం న్యూస్). :** జిల్లాలో రైతులు విక్రయానికి తీసుకొస్తున్న ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు.

శనివారం రాత్రి కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, సివిల్ సప్లై అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు మరియు సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కొనుగోలు ప్రక్రియ పురోగతిపై కలెక్టర్ సమగ్రంగా చర్చించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ భరోసా ఇచ్చారు. కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఇటీవల జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసిన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడవకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. టర్పాలిన్లతో ధాన్యాన్ని కప్పివేయడం, నీరు నిల్వ కాకుండా చర్యలు చేపట్టడం, అవసరమైతే అదనపు రక్షణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేవిధంగా, తూకం వేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో ఎక్కువసేపు నిల్వ ఉంచకుండా వెంటనే మిల్లులు లేదా స్టోరేజ్ కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం తరలింపులో ఆలస్యం జరగకుండా అవసరమైన రవాణా సదుపాయాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎక్కడైనా నిర్లక్ష్యం, జాప్యం లేదా రైతులకు ఇబ్బందులు తలెత్తితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ కొనుగోలు ప్రక్రియను సజావుగా కొనసాగించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, హుజూరాబాద్ ఆర్డీవో రమేష్ బాబు, సివిల్ సప్లై అధికారులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో రూ.1,535 కోట్ల రైల్వే ప్రాజెక్టులు ప్రారంభించనున్న ప్రధాని

**సికింద్రాబాద్ మే09( సమయం న్యూస్,) :** తెలంగాణలో రైల్వే కనెక్టివిటీ బలోపేతం, రద్దీ తగ్గింపు, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల లక్ష్యంగా సుమారు రూ. 1,535 కోట్ల విలువైన రైల్వే మౌలిక వసతుల ప్రాజెక్టులను ప్రధాని మే 10న జాతికి అంకితం చేయనున్నారు. కాజీపేట--విజయవాడ కారిడార్‌లో 118 కిలోమీటర్ల మల్టీ ట్రాకింగ్ పనులు పూర్తికావడంతో రైళ్ల రాకపోకల సామర్థ్యం పెరగనుంది. ప్రయాణికుల రైళ్లు, సరుకు రవాణా రైళ్లు మరింత వేగంగా, సమయపాలనతో నడిచే అవకాశం కలుగుతుంది. అలాగే 21 కిలోమీటర్ల కాజీపేట రైల్ అండర్ రైల్ బైపాస్ ద్వారా కాజీపేట జంక్షన్‌లో రద్దీ తగ్గనుంది. హైదరాబాద్, బల్హార్షా, విజయవాడ వైపు రైళ్లను ఒకేసారి నడిపేందుకు ఇది దోహదపడుతుంది. ఈ ప్రాజెక్టుల వల్ల హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలకు ప్రయోజనం కలగనుంది. తెలంగాణలో బొగ్గు, సిమెంట్, వ్యవసాయ ఉత్పత్తుల సరుకు రవాణా మరింత వేగవంతం కానుంది.



**హనుమకొండ జిల్లా మే 9 2026 శనివారం :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ప్రత్యేక అధికారిగా వాజ్‌పాయ్ గారు నేడు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వాజ్‌పాయ్ గారు మాట్లాడుతూ నగర అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడం తమ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. నగరాన్ని మరింత పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు.

# బేటీ బచావో కేవలం నినాదమేనా? -- కేటీఆర్ ప్రశ్న

**హైదరాబాద్ మే09( సమయం న్యూస్).**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసు వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఖ. ు. ఘఝ ఘశీ తీవ్రస్థాయిలో స్పందించారు. బాధితురాలికి న్యాయం చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయ్యాయని ఆరోపించారు.

ప్రధాని చీుతీవఅఎతీు వీశీఱఅని ఉద్దేశించి "బేటీ బచావో అనేది కేవలం నినాదానికే పరిమితమా?" అని ప్రశ్నించిన కేటీఆర్.. కేంద్ర మంత్రి దీుఅఎఱ ూఖఅ-ఝఎ ఖబఝుతీను ఎప్పుడు బర్తరఫ్ చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి కుమారుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని ప్రశ్నించారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఒక మైనర్ బాలిక ఫిర్యాదు చేసినప్పటికీ మూడు నెలల పాటు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం దారుణమన్నారు. ఉన్నావ్ ఘటనలో బాధితురాలికి అండగా నిలిచిన ఘప్త్రబశ్రీ +ఖఅస్త్రఱ ఇప్పుడు హైదరాబాద్‌కు వచ్చి ఈ బాధితురాలికి మద్దతు ఇస్తారా? అని ప్రశ్నించారు. బాధితురాలిపైనే హనీ ట్రాప్, వసూళ్ల కేసులు నమోదు చేయడాన్ని కేటీఆర్ ఖండించారు. బాధితురాలు ఇప్పటికే రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేసుకుందని, ఇప్పుడు ఆమెనే నిందిస్తూ విక్టిమ్ షేమింగ్ చేయడం అమానుషమన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీకి ఫ్రాంచైజీలా మారిందని విమర్శించిన కేటీఆర్.. మైనర్ బాలిక గౌరవం విషయంలో రెండు పార్టీలు అపవిత్ర ఒప్పందానికి వచ్చాయని ఆరోపించారు. మహిళల రక్షణ కోసం అవసరమైతే మరోసారి పోరాటానికి సిద్ధమని స్పష్టం చేశారు.



# జైస్వాల్, షెఫాలీకి నాడా నోటీసుల కలకలం

టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్, మహిళా క్రికెటర్ షెఫాలీ వర్మ డోప్ టెస్టింగ్ నిబంధనల అంశంతో వార్తల్లో నిలిచారు. నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (నాడా) 'వేర్ అబౌట్' క్లాజ్ ప్రకారం ఆటగాళ్లు తమ లొకేషన్ వివరాలు ముందుగానే ఇవ్వాల్సి ఉండగా.. నిర్దిష్ట సమయాల్లో టెస్టింగ్ అధికారులకు అందుబాటులో లేకపోవడంతో వీరిద్దరి పేర్లపై 'మిస్డ్ టెస్ట్' నమోదు అయినట్టు సమాచారం. యశస్వి జైస్వాల్ గత డిసెంబర్‌లో, షెఫాలీ వర్మ నవంబర్‌లో టెస్టింగ్‌కు అందుబాటులో లేరని తెలుస్తోంది. అనంతరం వివరణ కోరుతూ నాడా పంపిన నోటీసులకు స్పందన ఆలస్యమైనట్టు ప్రచారం సాగుతోంది. దీంతో తుది నోటీసులు జారీ చేసి సమాధానం కోరినట్టు సమాచారం. అయితే ప్రస్తుతం వీరిద్దరిపై ఎలాంటి నిషేధం వచ్చే పరిస్థితి లేదని క్రీడా వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. నాడా, వాడా నిబంధనల ప్రకారం 12 నెలల్లో మూడుసార్లు టెస్టింగ్ మిస్ అయితేనే కఠిన చర్యలు ఉంటాయి. ప్రస్తుతం ఒక్కసారి మాత్రమే నమోదు కావడంతో తక్షణ ప్రమాదం లేకపోయినా.. ఈ వ్యవహారం భారత క్రికెట్‌లో చర్చనీయాంశంగా మారింది.




# లేడీ ఫ్యాన్ సెల్ఫీ కోసం వెయిట్ చేసిన రోహిత్

**హైదరాబాద్ :** ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ మరోసారి తన సింప్లిసిటీతో అభిమానుల మనసు గెలుచుకున్నాడు. ఓ మహిళా అభిమాని సెల్ఫీ కోసం ప్రయత్నిస్తుండగా.. ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ అయినా రోహిత్ ఓపికగా ఎదురుచూసి చివరకు సెల్ఫీ ఇచ్చాడు. ఐపీఎల్ 2026 సందర్భంగా హోటల్ నుంచి టీమ్ బస్సులోకి వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. సెక్యూరిటీ మధ్యలోనూ రోహిత్ అనుమతితో ఆ మహిళ ఆయన వద్దకు చేరుకుంది. అయితే ఫోన్ ఆఫ్ కావడంతో ఆమె కంగారు పడినా.. రోహిత్ తొందరపడకుండా వెయిట్ చేశాడు. టీమ్ బస్సు కదులుతున్న సమయంలో కూడా ఆమె పిలుపు విని డోర్ వద్ద ఆగి సెల్ఫీ ఇచ్చాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా.. అభిమానులు రోహిత్ సరళ స్వభావంపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

# సమీకరణాలు మార్చేసి..

## ప్లే ఆఫ్స్‌లోకి దూసుకొచ్చిన కేకేఆర్



**హైదరాబాద్ :** ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ అద్భుతమైన కమ్‌బ్యాక్‌తో ప్లే ఆఫ్స్ రేసును ఆసక్తికరంగా మార్చేసింది. తొలి ఆరు మ్యాచ్‌ల్లో ఒక్క విజయం కూడా లేక తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న కేకేఆర్.. వరుసగా నాలుగు విజయాలతో ఒక్కసారిగా సమీకరణాలు మార్చి టాప్-4 పోరులోకి దూసుకొచ్చింది. ఢిల్లీ క్యాపిటల్స్‌పై 8 వికెట్ల భారీ విజయంతో కేకేఆర్ తమ నెట్ రన్‌రేట్‌ను గణనీయంగా పెంచుకుంది. స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్, అనుకుల్ రాయ్ బౌలింగ్‌లో మెరిసితే.. ఫిన్ అలెన్ మెరుపు సెంచరీతో లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించాడు. ఈ విజయంతో కోల్‌కతా పాయింట్ల పట్టికలో ఏడో స్థానానికి చేరింది. సీజన్ ఆరంభంలో విమర్శలు ఎదుర్కొన్న కెప్టెన్ అజింక్య రహానే.. ఇప్పుడు జట్టును విజయపథంలో నడిపిస్తూ ప్రశంసలు అందుకుంటున్నాడు. మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లో గెలిస్తే కేకేఆర్ నేరుగా ప్లే ఆఫ్స్ చేరే అవకాశముంది. దీంతో ప్రతి మ్యాచ్ ఇప్పుడు కోల్‌కతాకు కీలకంగా మారింది. ఆర్సీబీతో మే 13న జరగనున్న మ్యాచ్ కేకేఆర్ భవితవ్యాన్ని మరింత ప్రభావితం చేయనుంది. వరుస విజయాలతో ఊపుమీదున్న కోల్‌కతా.. ఇదే జోరు కొనసాగిస్తే ప్లే ఆఫ్స్‌లో సంచలనం సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# టైటాన్స్ జైత్రయాత్ర!

## శుభ్ మన్ గిల్, సాయి సుదర్శన్ సుడిగాలి ఇన్నింగ్స్

## రాజస్థాన్ బౌలర్ల ఊచకోత.. 229 పరుగుల భారీ స్కోరు

## ఛేదనలో కుప్పకూలిన రాయల్స్.. 77 పరుగుల తేడాతో పరాజయం

## 4 వికెట్లతో గుజరాత్ విజయంలో కీ రోల్ పోషించిన రషీద్ ఖాన్

## వరుసగా 4వ మ్యాచ్ లో గెలిచి జోరుమీదున్న గుజరాత్ టైటాన్స్





**జైపూర్ :** ఐపీఎల్ లో గుజరాత్ టైటాన్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. జైపూర్ లోని సవాయి మాన్ సింగ్ స్టేడియం వేదికగా శనివారం జరిగిన మ్యాచ్ లో ఆతిథ్య రాజస్థాన్ రాయల్స్ పై గుజరాత్ టైటాన్స్ ఘన విజయం సాధించింది. బ్యాటింగ్ లో కెప్టెన్ శుభ్ మన్ గిల్, సాయి సుదర్శన్ సుడిగాలి ఇన్నింగ్స్ తో చెలరేగగా.. బౌలింగ్ లో రషీద్ ఖాన్ మాయాజాలంతో రాజస్థాన్ ను ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఫలితంగా 77 పరుగుల భారీ తేడాతో గుజరాత్ అద్భుత విజయాన్ని అందుకుని టోర్నీలో వరుసగా 4వ గెలుపును తన ఖాతాలో వేసుకుంది.

### రాయల్స్ బౌలర్ల ఊచకోత..

టాస్ గెలిచిన రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే గుజరాత్ ఓపెనర్లు శుభ్ మన్ గిల్, సాయి సుదర్శన్ ఆరంభం నుంచే రాయల్స్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. పవర్ ప్లే 6 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 82 పరుగులు రాబట్టి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. సాయి సుదర్శన్ 36 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 55 పరుగులు చేసి ఔటవ్వగా.. శుభ్ మన్ గిల్ 44 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 84 పరుగులు చేసి తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. జోస్ బట్లర్ 13 పరుగులకే వెనుదిరిగినా.. చివర్లో వాషింగ్టన్ సుందర్ (20 బంతుల్లో 37 నాటౌట్), రాహుల్ తెవాటియా (4 బంతుల్లో 14) దొరికిన బంతిని దొరికినట్లు బాదారు. దీంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 229 పరుగుల భారీ స్కోరు సాధించింది. రాజస్థాన్ బౌలర్లలో బ్రిజేష్ శర్మకు 2 వికెట్లు దక్కగా.. రవీంద్ర జడేజా, యశ్ పుంజా తలో వికెట్ పడగొట్టారు. జోఫ్రా ఆర్చర్, తుషార్ దేశ్ పాండే భారీగా పరుగులు సమర్పించుకున్నారు.

### రషీద్ స్పిన్ ఉచ్చులో రాజస్థాన్..

230 పరుగుల కష్టమైన లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ ఏ దశలోనూ విజయం వైపు సాగలేదు. ఆరంభంలోనే ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ (16 బంతుల్లో 36), యశస్వి జైస్వాల్ (3) ఔటవడంతో రాయల్స్ కష్టాల్లో పడింది. కాసేపటికే హెట్ మెయర్ (6) కూడా పెవిలియన్ చేరాడు. ఈ దశలో రవీంద్ర జడేజా (25 బంతుల్లో 38), ధ్రువ్ జురెల్ (10 బంతుల్లో 24) ఇన్నింగ్స్ ను చక్కదిద్దే ప్రయత్నం చేసినా.. స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ వారి ఆశలపై నీళ్లు చల్లాడు. తన అద్భుతమైన స్పిన్ తో మిడిలార్డర్ ను కుప్పకూల్చాడు. జురెల్ తో పాటు శుభమ్ దూబే (15), జడేజా, డొనొవన్ ఫెరీరా (4) వికెట్లను పడగొట్టి మ్యాచ్ ను గుజరాత్ వైపు తిప్పాడు. రషీద్ ఖాన్ 4 ఓవర్లలో కేవలం 33 పరుగులిచ్చి 4 వికెట్లు తీయగా.. కగిసో రబాడ 33 పరుగులిచ్చి 2 వికెట్లు, జేసన్ హోల్డర్ 12 పరుగులకే 3 వికెట్లు పడగొట్టి రాజస్థాన్ పతనాన్ని శాసించారు. మహ్మద్ సిరాజ్ కు 1 వికెట్ దక్కింది. దీంతో రాజస్థాన్ 16.3 ఓవర్లలో 152 పరుగులకే ఆలౌట్ అయి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.

# సచిన్‌తో పోల్చొద్దు


## వైభవ్‌పై జాదవ్ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ :** ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున సంచలన ప్రదర్శన చేస్తున్న 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీపై మాజీ క్రికెటర్ కేదార్ జాదవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వైభవ్‌ను సచిన్ టెండూల్కర్‌తో పోల్చడాన్ని ఆయన తప్పుబట్టాడు. సచిన్ స్థాయిని ఎవరూ అందుకోలేరని, ఆయనతో యువ ఆటగాళ్లను పోల్చడం సరైనది కాదని స్పష్టం చేశాడు. సచిన్ టెండూల్కర్ కేవలం రికార్డుల ఆటగాడు మాత్రమే కాదని.. దశాబ్దాల పాటు భారత క్రికెట్‌కు అండగా నిలిచిన మహానుభావుడని జాదవ్ పేర్కొన్నాడు. 20 ఏళ్లకుపైగా ఒత్తిడిని తట్టుకుని కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలిచిన సచిన్‌తో ఎవరినీ తొందరగా పోల్చరాదని సూచించాడు. వైభవ్ సూర్యవంశీ ప్రతిభావంతుడని అంగీకరించిన జాదవ్.. ఇలాంటి పోలికలు యువ ఆటగాడిపై అనవసర ఒత్తిడిని పెంచుతాయని హెచ్చరించాడు. ప్రతి ఇన్నింగ్స్‌ను పరీక్షలా మార్చడం అతడి సహజ ఎదుగుదలకు ఆటంకమవుతుందని చెప్పాడు. సోషల్ మీడియా, మొబైల్‌కు దూరంగా ఉంటూ ఆటపై మాత్రమే దృష్టి పెట్టాలని వైభవ్‌కు సలహా ఇచ్చాడు. ఈ సీజన్‌లో రాజస్థాన్ తరఫున అద్భుత ఫామ్‌లో ఉన్న వైభవ్.. 10 ఇన్నింగ్స్‌ల్లో 404 పరుగులతో ఆకట్టుకుంటున్నాడు. సెంచరీ, రెండు అర్ధ సెంచరీలతో పాటు 237కు పైగా స్ట్రైక్‌రేట్‌తో మెరిసిన ఈ యువ సంచలనం ఇప్పటికే భారత క్రికెట్ భవిష్యత్తుపై భారీ ఆశలు పెంచుతున్నాడు.

# ఒక్క సెంచరీ.. ఎన్నో రికార్డులు

**హైదరాబాద్ :** ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఓపెనర్ ఫిన్ అలెన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో అరుదైన రికార్డులు సృష్టించాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 47 బంతుల్లోనే శతకం బాది.. కేకేఆర్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. 5 ఫోర్లు, 10 భారీ సిక్సర్లతో నాటౌట్‌గా నిలిచిన అలెన్.. ఒక్క ఇన్నింగ్స్‌తోనే చరిత్రలో చోటు సంపాదించాడు. కేకేఆర్ తరఫున ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన బ్యాటర్ల జాబితాలో ఫిన్ అలెన్ మూడో స్థానానికి చేరాడు. బ్రెండన్ మెక్‌కల్లమ్ 13 సిక్సర్లతో అగ్రస్థానంలో ఉండగా.. ఆండ్రీ రస్సెల్ 11 సిక్సర్లతో రెండో స్థానంలో ఉన్నాడు. ఇప్పుడు అలెన్ 10 సిక్సర్లతో ఈ ప్రత్యేక జాబితాలో చేరాడు. అంతేకాదు.. కేకేఆర్ తరఫున ఐపీఎల్‌లో సెంచరీ చేసిన అరుదైన బ్యాటర్లలో కూడా తన పేరు నమోదు చేసుకున్నాడు. మెక్‌కల్లమ్, వెంకటేష్ అయ్యర్, సునీల్ నరైన్ తర్వాత ఈ ఘనత సాధించిన ఆటగాడిగా నిలిచాడు. మరోవైపు 2026లో మూడు టీ20 సెంచరీలు చేసిన తొలి న్యూజీలాండ్ బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ చరిత్రలో బ్రెండన్ మెక్



కల్లమ్ తర్వాత శతకం సాధించిన రెండో న్యూజీలాండ్ బ్యాటర్‌గా ఫిన్ అలెన్ ప్రత్యేక గుర్తింపు పొందాడు. ఒక్క సెంచరీతో కేకేఆర్ చరిత్రలోనే కాకుండా న్యూజీలాండ్ క్రికెట్‌లోనూ తన పేరు బలంగా ముద్రించాడు.



# ‘స్పిరిట్’ కోసం ప్రభాస్ యాక్షన్ రెడీ

## పోలీస్ పాత్రకు ప్రత్యేక శిక్షణ.. భారీ ఫైట్ సీక్వెన్స్‌కు సిద్ధం

**హైదరాబాద్ :** ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ‘స్పిరిట్’ సినిమా కోసం ప్రభాస్ భారీ యాక్షన్ సన్నివేశాల రిహార్సల్స్‌లో పాల్గొంటున్నట్టు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో ప్రభాస్ తొలిసారి పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనుండటంతో యాక్షన్, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు సమాచారం. కీలకమైన ఫైట్ సీన్ కోసం దాదాపు 100 మంది ఫైటర్లతో రిహార్సల్స్ జరుగుతున్నాయని, మే 10 నుంచి కొత్త షెడ్యూల్ ప్రారంభమయ్యే అవకాశముందని తెలుస్తోంది. పాత్ర కోసం ప్రభాస్ బరువు తగ్గి మరింత ఫిట్‌గా కనిపించనున్నారని టాక్. ఇందుకోసం కఠినమైన డైట్, వర్కౌట్ ప్లాన్‌ను అనుసరిస్తున్నారట. త్రిప్తి దిమ్రీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని భద్రకాళి పిక్చర్స్, టీ సిరీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. వచ్చే ఏడాది మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది భాషల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.


# రౌడీ జనార్ధన నుంచి రొమాంటిక్ పోస్టర్

## విజయ్ బర్త్‌డేకు స్పెషల్ ట్రీట్

**హైదరాబాద్ :** విజయ్ దేవరకొండ హీరోగా తెరకెక్కుతున్న ‘రౌడీ జనార్ధన’ చిత్రం నుంచి ఆయన పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో విజయ్ పాత్రను రొమాంటిక్ టచ్‌తో పరిచయం చేస్తూ సినిమాపై అంచనాలు పెంచేశారు. ‘ప్రపంచంతో పోరాడే వ్యక్తి.. కేవలం ప్రేమకు మాత్రమే లొంగిపోతాడు’ అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో విడుదలైన పోస్టర్‌లో విజయ్ స్టైల్, యాటిట్యూడ్ అభిమానులను ఆకట్టుకుంటోంది. మాస్ ఇమేజ్‌కు ప్రేమను జోడిస్తూ దర్శకుడు పాత్రను డిజైన్ చేసిన తీరు ఆసక్తి రేపుతోంది. రవి కిరణ్ కోలా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తోంది. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రం మాస్, యాక్షన్, రొమాన్స్ మేళవింపుతో ప్రేక్షకుల ముందుకు రానుంది. పోస్టర్ విడుదలతో సోషల్ మీడియాలో సినిమాపై చర్చ మరింత ఊపందుకుంది.




# ‘పెద్ది’ ట్రైలర్‌కు గ్రాండ్ ప్లాన్




## భోపాల్‌లో మే 16న భారీ ఈవెంట్?

## రెహమాన్ లైవ్ షోపై టాక్

**హైదరాబాద్ :** రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న మల్టీ స్పోర్ట్స్ డ్రామా ‘పెద్ది’ ప్రమోషన్స్ జోరందుకున్నాయి. జూన్ 4న విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా ట్రైలర్‌ను మే 16న గ్రాండ్‌గా రిలీజ్ చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్టు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో నిర్వహించే అవకాశముందని సమాచారం. రామ్ చరణ్, జాన్వీ కపూర్, దర్శకుడు బుచ్చిబాబు సహా చిత్ర యూనిట్ ఈ వేడుకలో పాల్గొననున్నట్టు టాక్. నార్త్ ఇండియా మార్కెట్‌పై ఫోకస్‌తో ఈ లొకేషన్ ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. కేవలం ట్రైలర్ విడుదల కార్యక్రమంగా కాకుండా.. మ్యూజికల్ ఫెస్టివల్ తరహాలో ఈ ఈవెంట్‌ను నిర్వహించాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారట. ఇందులో సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ లైవ్ పెర్ఫార్మెన్స్ కూడా ఉండొచ్చన్న ప్రచారం మరింత ఆసక్తి పెంచుతోంది. విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ‘పెద్ది’పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ట్రైలర్‌తో సినిమా హైప్ మరింత పెరిగే అవకాశముందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే ట్రైలర్ డేట్, ఈవెంట్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# స్పోర్ట్స్ వేర్‌లో సెగలు రేపుతున్న నభా

## ఫిట్‌నెస్‌తో పాటు గ్లామర్ షో..

టాలీవుడ్ హీరోయిన్ నభా నటేష్ తాజా జిమ్ ఫోటోలతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. స్పోర్ట్స్ వేర్‌లో స్టైలిష్‌గా మెరిసిన నభా.. ఫిట్‌నెస్‌తో పాటు గ్లామర్ టచ్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది. పౌడర్ బ్లూ స్పోర్ట్స్ బ్రా, హై వెయిస్ట్ లెగ్గింగ్స్‌లో నభా ఫిట్ అండ్ ఫ్యాషనబుల్ లుక్‌లో కనిపించింది. జిమ్‌లోని ప్రత్యేక లైటింగ్ మధ్య ఆమె స్టైల్ మరింత హైలైట్ అయింది. ట్రెండీ యాక్సెసరీస్, స్టైలిష్ హెయిర్ స్టైల్‌తో నభా తన ఫిట్‌నెస్ ఫోటోలను మరో స్థాయికి తీసుకెళ్లింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. నభా లుక్‌పై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఫిట్‌నెస్, ఫ్యాషన్ కలయికలో నభా మరోసారి తన ప్రత్యేకత చాటుకుంది.



# బోల్డ్ లుక్‌లో భాగ్యశ్రీ బోర్సే

## గ్లామర్‌తో మెరిసిన యంగ్ బ్యూటీ

**హైదరాబాద్ :** యంగ్ హీరోయిన్ భాగ్య శ్రీ బోర్సే బర్త్‌డే సందర్భంగా ఆమె నటిస్తున్న తమిళ చిత్రం ‘సేయోన్’ నుంచి మేకర్స్ స్పెషల్ ఫస్ట్‌లుక్ పోస్టర్లను విడుదల చేశారు. శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో భాగ్య శ్రీ కొత్త లుక్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరోవైపు ‘లెనిన్’ టీమ్ కూడా ప్రత్యేక పోస్టర్ విడుదల చేయడంతో అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది. తాజాగా భాగ్య శ్రీ చాక్లెట్ బ్రౌన్ సీక్విన్ గౌన్‌లో గ్లామర్ టచ్‌తో ఆకట్టుకుంది. స్టైలిష్ అవుట్‌ఫిట్, సింపుల్ జ్యువెలరీ, వేవీ హెయిర్‌తో ఆమె లుక్ ప్రత్యేకంగా నిలిచింది. ఈ బర్త్‌డే పోస్టర్లు ప్రస్తుతం సోషల్ మీడియాలో భాగ్య శ్రీకు మరింత క్రేజ్ తీసుకొచ్చాయి.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# ఓటమికి ఈవీఎంలే సాకా?

## వ్యవస్థలపై నమ్మకం సడలిస్తే ప్రజాస్వామ్యానికే ముప్పు

(ఆకుల సత్తిరాజు, సీనియర్ జర్నలిస్ట్)

ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజం. ప్రజల తీర్పును శిరసావహించి, తమ వైఫల్యాలను సరిదిద్దుకోవడమే ఏ రాజకీయ పార్టీకైనా హుందాతనం. కానీ, ఇటీవల ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల అనంతరం దేశంలో ఒక విచిత్రమైన ధోరణి కనిపిస్తోంది. ఓటమికి గల వాస్తవ కారణాలను విశ్లేషించుకోవాల్సిన ప్రతిపక్షాలు.. ఆ నెపాన్ని నేరుగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)పై, స్వయంప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘంపై నెట్టడం విచారకరం. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మొదలుకొని జాతీయ స్థాయి నాయకుల వరకు ఈ ఫలితాలను 'కుట్ర'గా అభివర్ణించడం రాజ్యాంగబద్ధ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసే చర్యే అవుతుంది.



### పునరావృతమవుతున్న ఈవీఎంల లొల్లి

2014 సార్వత్రిక ఎన్నికల నుంచి ప్రతిపక్ష కూటమికి ఓటమి ఎదురైనప్పుడల్లా ఈవీఎంల ట్యాంపరింగ్ అంశం తెరపైకి వస్తోంది. 2017లో ఎన్నికల సంఘం విసిరిన 'ఈవీఎం ఛాలెంజ్'లో ట్యాంపరింగ్‌ను ఏ పార్టీ నిరూపించలేకపోయింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో వీవీప్యాట్‌లను ప్రవేశపెట్టినా అనుమానాలు నివృత్తి కాకపోవడం విడ్డూరం. ఒకవేళ ఈవీఎంలే ఫలితాలను డిసైడ్ చేస్తే.. కేరళలో కాంగ్రెస్ సాధించిన భారీ విజయం, తమిళనాడులో ప్రతిపక్షాల గెలుపు ఎలా సాధ్యమయ్యాయి? గెలిచినప్పుడు మౌనంగా ఉండి, ఓడినప్పుడు యంత్రాలను నిందించడం రాజకీయ వైఫల్యమే అవుతుంది.

### బెంగాల్ బరిలో మారిన లెక్కలు


బెంగాల్‌లో భాజపా ఎదుగుదల ఒక్కరోజులో జరిగింది కాదు. 2016లో పది శాతంగా ఉన్న ఆ పార్టీ ఓట్ల వాటా, నేడు 45 శాతానికి పైగా చేరిందంటే ప్రజా క్షేత్రంలో ఏదో మార్పు జరిగిందని అర్థం. అదే సమయంలో తృణమూల్ కాంగ్రెస్ ఓట్ల శాతం 48 నుంచి 40కి పడిపోవడంపై ఆ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలి. పదిహేనేళ్ల అధికార వ్యతిరేకత, అవినీతి ఆరోపణలు, మహిళల భద్రత, ఓటు బ్యాంకు రాజకీయాలు వంటి అంశాలే మమతా బెనర్జీ ఓటమికి కారణాలని విశ్లేషకులు భావిస్తున్నారు. వీటిని కాదని, ఇంటెన్సివ్ రివిజన్ పేరిట ఓట్ల తొలగింపు జరిగిందని ఆరోపించడం కేవలం సాకుగా మాత్రమే కనిపిస్తోంది.

### సంస్కరణలు - సవాళ్లు

ఎన్నికల ప్రక్రియలో లోపాలు గతంలోనూ ఉన్నాయి. 1952లో మొదటి ఎన్నికల సమయంలోనే నెహ్రూ బ్యాలెట్ పెట్టెల తారుమారుపై ఫిర్యాదులు చేశారు. 90వ దశకంలో టీఎన్ శేషన్ హయాంలో బహుళ దశల ఎన్నికలు, కేంద్ర బలగాల మోహరింపు వంటి సంస్కరణలు వచ్చాయి. నేడు బెంగాల్ వంటి రాష్ట్రాల్లో హింసను అరికట్టి, ఓటర్లలో భరోసా నింపేందుకు కేంద్ర బలగాల ఉనికి అవసరమని 90 శాతానికి పైగా నమోదైన ఓటింగ్ శాతాలే నిరూపిస్తున్నాయి. లోపాలుంటే సరిదిద్దాలని డిమాండ్ చేయడంలో తప్పులేదు కానీ, ఏకంగా వ్యవస్థలనే కుట్రలో భాగస్వాములని ముద్రవేయడం ప్రజాస్వామ్య ఆరోగ్యానికి హానికరం.

**ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారు. ఆరోపణల కంటే అజెండాకే ఓటర్లు ప్రాధాన్యత ఇస్తారు. ప్రతిప క్షాలు ఇకనైనా క్షేత్రస్థాయి సమస్యలు, సంస్థాగత బలం పై దృష్టి సారించాలి. ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవా లే తప్ప, సాంకేతికతను లేదా రాజ్యాంగబద్ధ సంస్థలను నిందించడం ద్వారా రాజకీయ ప్రయోజనం పొంద లేరు. గెలుపోటములను సమానంగా స్వీకరించి, ప్రజా స్వామ్య స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.**

# పర్యాటకులకు త్రిశూల్ కనువిందు



**విశాఖపట్నం, మే 9:** విశాఖ కైలాసగిరికి అదనపు ఆకర్షణ వచ్చింది. పర్యాటకులకు విందుచేసేలా తీర్చిదిద్దారు. పర్యాటకులను ఆకట్టుకునేలా విశాఖలోని కైలాసగిరిపై రూ.3 కోట్లతో చేపట్టిన 'త్రిశూల్ ప్రాజెక్టు'ను మంత్రులు నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, విశాఖ ఎంపీ శ్రీభరత్ ప్రారంభించారు. ఇందులో భాగంగా భారీ త్రిశూలాన్ని ఏర్పాటు చేశారు. తుపాన్లు, ప్రచండ గాలులనూ తట్టుకునేలా దీన్ని నిర్మించారు. త్రిశూలం పొడవు 65 అడుగులైతే... అందులో ఢమరుకం 10 అడుగుల ఎత్తు, 18 అడుగుల వెడల్పు ఉంది. నగరంలో వివిధ ప్రాంతాల నుంచి కూడా కనిపించేలా ఎత్తయిన కొండపై నిర్మించడమేగాక.. త్రిశూలం వెలుగులు విరజిమ్మేలా లోపల ఎల్ఈడీ దీపాలు అమర్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణు కుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల శ్రీనివాస్, లోకం మాధవి, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# చీపురుపల్లి రాజకీయాల్లో కొత్త వారసత్వం

## సత్తిబాబు తర్వాత అనూష ఎంట్రీకి రంగం సిద్ధం!

(విజయనగరం)

విజయనగరం జిల్లా రాజకీయాల్లో కీలక స్థానం కలిగిన చీపురుపల్లి నియోజకవర్గం మరోసారి ఆసక్తికర రాజకీయ పరిణామాలకు వేదికగా మారుతోంది. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ రాజకీయ వారసత్వం ఇప్పుడు ఆయన కుమార్తె అనూష వైపు మళ్లుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దాదాపు మూడు దశాబ్దాలుగా జిల్లా రాజకీయాల్లో ప్రభావం చూపిన బొత్స సత్యనారాయణ, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితులు, రాజకీయ మార్పులు, కుటుంబ అంతర్గత సమీకరణాల నేపథ్యంలో భవిష్యత్ రాజకీయ వ్యూహాలను అమలు చేస్తున్నట్టు తెలుస్తోంది.



2029 ఎన్నికల్లో తాను ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండే అవకాశాలు తగ్గిపోతున్నాయని భావించిన ఆయన, ముందుగానే తన కుమార్తె అనూషను రాజకీయ రంగంలోకి తీసుకురావడానికి చర్యలు ప్రారంభించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే చీపురుపల్లి పరిధిలో అనూష పర్యటనలు, పార్టీ కార్యకర్తలతో సమావేశాలు, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం పెరగడం ఈ ప్రచారానికి మరింత బలం చేకూరుస్తోంది. ముఖ్యంగా బొత్స కుటుంబం నుంచి మరో నాయకుడు టికెట్ కోసం ముందుకు రాకుండా ముందస్తు వ్యూహంతోనే ఆమెను ప్రమోట్ చేస్తున్నారన్న చర్చ వైసీపీ వర్గాల్లో సాగుతోంది.

### సత్తిబాబు రాజకీయ ప్రస్థానం

1996లో బొబ్బిలి పార్లమెంట్ ఎన్నికలతో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన బొత్స సత్యనారాయణ, తొలి రెండు ఎన్నికల్లో కొండపల్లి పైడితల్లి నాయుడు చేతిలో ఓటమి చవిచూశారు. అనంతరం 1999లో విజయంతో రాజకీయంగా నిలదొక్కుకుని, 2004 నుంచి చీపురుపల్లి కేంద్రంగా తన ప్రభావాన్ని విస్తరించారు. గద్దె బాబూరావుపై వరుస విజయాలు, వైఎస్సార్ హవా, ఆ తర్వాత జగన్ ప్రభుత్వంలో కీలక మంత్రిత్వ బాధ్యతలు ఆయన రాజకీయ ప్రస్థానానికి బలాన్నిచ్చాయి. అయితే 2014లో కిమిడి మృణాళిని, 2024లో కళా వెంకట్రావు చేతిలో ఎదురైన పరాజయాలు ఆయన రాజకీయ గ్రాఫ్‌ను ప్రభావితం చేశాయి.



### కుటుంబ రాజకీయాల్లోనూ వ్యూహం

చీపురుపల్లి టికెట్‌పై కుటుంబంలోనే పోటీ వాతావరణం ఏర్పడే అవకాశాలను ముందుగానే గుర్తించిన బొత్స, తన కుమార్తెను రాజకీయంగా ముందుకు తీసుకువచ్చి పార్టీ క్యాడర్‌కు స్పష్టమైన సంకేతం ఇచ్చారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో కుటుంబంలో ఇతర ఆశావహులు కూడా వెనక్కి తగ్గినట్లు సమాచారం.

### టీడీపీ వ్యూహమే కీలకం

మరోవైపు తెలుగుదేశం పార్టీలో కూడా భవిష్యత్ వ్యూహాలపై చర్చ నడుస్తోంది. కళా వెంకట్రావు స్థానంలో నాగార్జునను బరిలోకి దింపే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. ఒకవేళ వైసీపీ నుంచి అనూష, టీడీపీ నుంచి నాగార్జున పోటీ పడితే చీపురుపల్లి పోరు మరోసారి హోరాహోరీగా మారే అవకాశముంది. ఇప్పటికైతే చీపురుపల్లి రాజకీయాల్లో "సత్తిబాబు వారసత్వం" కొనసాగేందుకు అనూషను ముందుకు తెచ్చే ప్రయత్నంలో బొత్స సత్యనారాయణ విజయవంతమయ్యారనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.



# దుర్గమ్మను దర్శించుకున్న లోకేశ్

## పూర్ణకుంభ స్వాగతం పలికిన అధికారులు

**విజయవాడ, మే 9:** ప్రముఖ పుణ్యక్షేత్రం విజయవాడ ఇంద్రకిలాద్రిపై కనకదు–ర్గమ్మను ఐటీ శాఖ మంత్రి, టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ దర్శించుకున్నారు. శనివారం ఉదయం ఆలయానికి వచ్చిన మంత్రికి దేవాదాయ కమిషనర్ రాంచంద్ర మోహన్, ఆలయ ఈవో శీనా నాయక్, పాలక మండలి చైర్మన్ బొర్రా రాధా కృష్ణ.. పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో లోకేశ్ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనం అనంతరం లోకేశ్‌కు వేద పండితులు ఆశీర్వాదం అందించగా... అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఆలయ అధికారులు అందజేశారు. లోకేశ్ రాకతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా దుర్గమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ అభివృద్ధి గురించి అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అమ్మవారి దర్శనం కల్పించాలని అధికారులకు తెలిపారు. అనంతరం ఏపీ ప్రభుత్వ సలహాదారులు వేమూరి రవి కుమారు కుమారుడు కిరణ్ వివాహ వేడుకల్లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరులో రోడ్డు విస్తరణ పనులకు మంత్రి శ్రీకారం



**కడప,మే 9 :** వైకాపా హయాంలో ఆర్‌అండ్‌బీ శాఖను జగన్ నిర్వీర్యం చేశారని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులోని కొర్రపాడు రోడ్డు విస్తరణ పనులకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. రూ.5కోట్లతో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విధ్వంసంతో జగన్.. అభివృద్ధితో కూటమి పాలన ప్రారంభమైందన్నారు. వైకాపా పాలనలో రోడ్లన్నీ గుంతలమయమేనని ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే రూ.1,080 కోట్లతో రోడ్లపై గుంతల్లేని రాష్ట్రంగా మార్చామని చెప్పారు.

# ఆగస్ట్ తిరుమల సేవా టికెట్లు

## 18న విడుదల చేయనున్న టిటిడి

**తిరుమల,మే 9:** తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన ఆగస్టు నెల కోటాను తితిదే ఈ నెల 18న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల రిజిస్ట్రేషన్ కోసం 20న ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. లాటరీలో ఎంపికైన భక్తులు ఈ నెల 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నంలోపు సొమ్ము చెల్లిస్తే టికెట్లు మంజూరవుతాయి. 21న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లు విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటా మధ్యాహ్నం 3 గంటలకు విడుదలవుతుంది. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం కోటా, 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన కోటా అందుబాటులో ఉంటుంది. మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన కోటా విడుదలవుతుంది. 25న ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు అ÷–దదె గదుల బుకింగ్ కోటా విడుదల చేస్తారు. భక్తులు వెబ్‌సైట్‌లో సేవా టికెట్లను బుక్ చేసుకోవాలని తితిదే సూచించింది.

# నేడు చంద్రబాబు, పవన్ నివాసాలకు మోడీ

**హైదరాబాద్, మే 9:** ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా నగరంలోని ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసాలకు ప్రధాని వెళ్లే అవకాశముంది. ఇప్పటికే చంద్రబాబు, పవన్ నివాస మార్గాల్లో భద్రతా సిబ్బంది ప్రధాని కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. పవన్ కళ్యాణం ముక్కు సర్జరీతో రెస్ట్ తీసుకుంటున్నారు. చంద్రబాబు శనివారం బెంగాల్ సిఎం సువేందు అధికారి ప్రమాణానికి కూడా హాజరయ్యారు.





# బంగారం ధరలు స్థిరం

**హైదరాబాద్, మే 9 :** గత కొన్ని రోజులుగా బంగారం ధరలు పెద్దగా మార్పులు లేకుండా స్థిరంగా కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ పరిస్థితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావంతో పసిడికి డిమాండ్ మాత్రం కొనసాగుతోంది. దీంతో బంగారం ధరలు లక్షన్నర రూపాయల సమీపంలోనే నిలకడగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం నాటికి హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,52,670గా నమోదైంది. అదే సమయంలో 22 క్యారెట్ల పది గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,39,940గా కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధర రూ.1,52,870గా ఉండగా, 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,40,090గా నమోదైంది. ఇక వెండి ధరలు మాత్రం స్వల్పంగా పెరిగాయి. కిలో వెండిపై రూ.100 పెరుగుదల నమోదైంది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,74,800గా ఉంది. ఢిల్లీలో కిలో వెండి ధర రూ.2,75,100గా కొనసాగుతోంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2,74,800గా ఉండగా, బెంగళూరులో రూ.2,75,100గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గుచూపడం వల్ల బంగారం ధరలు సమీప కాలంలో ఇదే స్థాయిలో కొనసాగే అవకాశముందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ఎస్బీఐ లాభం రూ.19,684 కోట్లు




**ముంబై, మే 9 :** దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరపు చివరి త్రైమాసికంలో బ్యాంక్ ఏకీకృత నికర లాభం 6 శాతం పెరిగి రూ.19,684 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో బ్యాంక్ లాభం రూ.18,643 కోట్లుగా నమోదుకాగా, ఈసారి స్వల్ప వృద్ధిని నమోదు చేసింది. అయితే బ్యాంక్ మొత్తం ఆదాయం మాత్రం తగ్గింది. గత ఏడాది రూ.1,43,876 కోట్లుగా ఉన్న ఆదాయం, ఈసారి రూ.1,40,412 కోట్లకు పడిపోయినట్లు వెల్లడించింది. త్రైమాసిక ఫలితాల అనంతరం ఎస్బీఐ షేర్లు మార్కెట్లో భారీ ఒత్తిడికి గురయ్యాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో బ్యాంక్ షేరు 6.62 శాతం పడిపోయి రూ.1,019.55 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కూడా 6.65 శాతం నష్టపోయి రూ.1,019.30 వద్ద స్థిరపడింది. దీంతో బ్యాంక్ మార్కెట్ విలువలో సుమారు రూ.66,691 కోట్ల మేర క్షీణత నమోదై, మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.9.41 లక్షల కోట్లకు తగ్గింది. మరోవైపు బ్యాంక్ నిరర్థక ఆస్తుల విషయంలో మెరుగైన ఫలితాలు నమోదు చేసింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి గత ఏడాది 1.82 శాతం నుంచి 1.49 శాతానికి తగ్గింది. అలాగే నికర నిరర్థక ఆస్తులు 0.47 శాతం నుంచి 0.39 శాతానికి పడిపోయాయి. ఏకీకృత ప్రాతిపదికన చూస్తే, బ్యాంక్ రూ.1,81,079 కోట్ల ఆదాయంపై రూ.19,643 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. వాటాదారులకు ప్రతీ షేరుకు రూ.17.35 డివిడెండ్‌ను ప్రకటించినట్లు ఎస్బీఐ బోర్డు వెల్లడించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ రుణాల వృద్ధి 13 నుంచి 15 శాతం వరకు నమోదైందని బ్యాంక్ పేర్కొంది. అయితే అంతర్జాతీయ పరిస్థితులు మరింత కాలం కొనసాగితే దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించింది.

## బంధన్ బ్యాంక్ విస్తరణ

**హైదరాబాద్, మే 9 :** ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ బంధన్ బ్యాంక్ తెలంగాణలో తన వ్యాపారాన్ని మరింత విస్తరించింది. రాష్ట్రంలో ఒకేసారి మూడు కొత్త శాఖలను ప్రారంభించినట్లు సంస్థ ప్రకటించింది. ఈ కొత్త శాఖల్లో రెండు హైదరాబాద్‌లో ప్రారంభించగా, మరో శాఖను మిర్యాలగూడలో ఏర్పాటు చేశారు. తాజా విస్తరణతో తెలంగాణలో బంధన్ బ్యాంక్ శాఖల సంఖ్య 162కు చేరుకుంది. దక్షిణ భారత మార్కెట్‌లో తమ ఉనికిని మరింత బలోపేతం చేసుకునే లక్ష్యంతో ఈ విస్తరణ చేపట్టినట్లు బంధన్ బ్యాంక్ ఎండీ, సీఈవో పార్థ ప్రతీమ్ సేన్‌గుప్తా తెలిపారు. తెలంగాణతో పాటు తమిళనాడులో ఐదు శాఖలు, కేరళ మరియు కర్ణాటక రాష్ట్రాల్లో చెరో రెండు శాఖలను కూడా ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని, కొత్త శాఖల ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించగలమని పేర్కొన్నారు. డిజిటల్ బ్యాంకింగ్ సేవలతో పాటు గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో వినియోగదారులకు సులభంగా ఆర్థిక సేవలు అందించడంపై సంస్థ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు బ్యాంక్ వర్గాలు తెలిపాయి.

# పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం

**న్యూఢిల్లీ, మే 9 :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ సంస్థలు భారీ నష్టాలను భరిస్తున్నట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా పెరిగినప్పటికీ, దేశీయంగా పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను స్థిరంగా ఉంచేందుకు ప్రభుత్వరంగ చమురు సంస్థలు భారీ ఆర్థిక భారం మోయాల్సి వస్తోంది. ప్రస్తుతం ఆయా సంస్థలకు రోజుకు సుమారు రూ.700 కోట్ల వరకు, నెలకు దాదాపు రూ.30 వేల కోట్ల మేర నష్టం వాటిల్లుతున్నట్లు సమాచారం. హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఏర్పడిన ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు సరఫరాపై ఆందోళనలు పెరిగాయి. దీంతో బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్లను దాటింది. అయినప్పటికీ దేశీయ వినియోగదారులపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం ధరలను నియంత్రిస్తోంది. అంతర్జాతీయంగా ధరలు పెరిగినా, దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరగకుండా ప్రభుత్వరంగ చమురు సంస్థలే అదనపు వ్యయాన్ని భరిస్తున్నాయి. వినియోగదారులకు ఉపశమనం కల్పించేందుకు పెట్రో ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని కూడా సుమారు పది శాతం మేర తగ్గించినట్లు తెలుస్తోంది.



మరోవైపు ప్రపంచంలోని పలు దేశాల్లో చమురు ధరలు భారీగా పెరిగాయి. స్పెయిన్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు 34 శాతం వరకు పెరగగా, జపాన్, ఇటలీ, ఇజ్రాయెల్ దేశాల్లో 30 శాతం వరకు పెరుగుదల నమోదైంది. జర్మనీలో 27 శాతం, బ్రిటన్‌లో 22 శాతం మేర చమురు ధరలు పెరిగినట్లు అంతర్జాతీయ మార్కెట్ వర్గాలు వెల్లడించాయి.

ప్రస్తుతం కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు మరింత తీవ్రతరమైతే, భవిష్యత్తులో దేశీయ మార్కెట్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు గ్లోబల్ గుర్తింపు



**న్యూఢిల్లీ, మే 9 :** భారత మోటార్‌సైకిల్ తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్రపంచవ్యాప్తంగా మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన ఆటోమొబైల్ బ్రాండ్ల జాబితాలో మూడో స్థానాన్ని దక్కించుకుని అంతర్జాతీయ స్థాయిలో తన ప్రభావాన్ని చాటింది. బ్రాండ్ ఫైనాన్స్ విడుదల చేసిన "ఆటోమోటివ్ ఇండస్ట్రీ–2026" నివేదిక ప్రకారం టయోటా, బీఎండబ్ల్యూ తర్వాత రాయల్ ఎన్‌ఫీల్డ్ నిలిచింది. ఆడి, ఫెరారీ వంటి ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్లను వెనక్కి నెట్టడం విశేషంగా మారింది. ఈ నివేదికలో రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు బ్రాండ్ స్ట్రెంగ్త్ ఇండెక్స్‌లో 100కు 88.9 స్కోరు లభించగా, "ఏఏఏ" రేటింగ్ కూడా దక్కింది. గత ఏడాదితో పోలిస్తే సంస్థ బ్రాండ్ విలువ 30 శాతం పెరిగి 1.2 బిలియన్ డాలర్లకు చేరినట్లు వెల్లడించింది. ఒకప్పుడు కేవలం రెట్రో బైక్‌ల తయారీ సంస్థగా గుర్తింపు పొందిన రాయల్ ఎన్‌ఫీల్డ్, ఇప్పుడు ప్రపంచ మార్కెట్‌లో తనదైన ముద్ర వేస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థ 80కు పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 3,200కుపైగా రిటైల్ కేంద్రాలను నిర్వహిస్తున్న సంస్థ, ఏడు అంతర్జాతీయ అసెంబ్లీ ప్లాంట్లతో తన ఉనికిని మరింత బలపరిచింది. యూరప్, దక్షిణ అమెరికా, ఆగ్నేయాసియా, ఆస్ట్రేలియా ప్రాంతాల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లకు భారీ డిమాండ్ పెరుగుతోందని సంస్థ తెలిపింది. క్లాసిక్ డిజైన్‌తో పాటు సులభమైన ఇంజినీరింగ్, ప్రత్యేక రైడింగ్ అనుభూతి ఈ బ్రాండ్ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. హంటర్ 350, సూపర్ మీటియోర్ 650, హిమాలయన్ 450 వంటి మోడళ్లు యువతను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా అడ్వెంచర్ విభాగంలో హిమాలయన్ 450 మంచి ఆదరణ పొందుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ జాబితాలో భారతీయ ఆటో రంగానికి చెందిన ఇతర సంస్థలు కూడా ప్రాధాన్యం సంపాదించాయి. టాటా మోటార్స్ ఐదో స్థానంలో నిలవగా, మహీంద్రా 25వ స్థానం, మారుతీ సుజుకి 34వ స్థానాలను దక్కించుకున్నాయి. భారత ఆటోమొబైల్ రంగం అంతర్జాతీయంగా వేగంగా ఎదుగుతోందనే విషయానికి ఇవి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

# అంతరిక్ష ఇంటర్నెట్‌పై రిలయన్స్ ఫోకస్

**ముంబై, మే 9 :** టెలికాం రంగంలో జియోతో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇప్పుడు శాటిలైట్ ఇంటర్నెట్ రంగంపై దృష్టి సారించింది. ముఖేష్ అంబానీ నేతృత్వంలోని సంస్థ అంతరిక్షం ద్వారా ఇంటర్నెట్ సేవలు అందించే ప్రణాళికలను వేగవంతం చేస్తోంది. ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్, అమెజాన్ ప్రాజెక్ట్ కైపర్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలకు పోటీగా భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టేందుకు రిలయన్స్ సిద్ధమవుతోంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు బాధ్యతలను జియో ప్లాట్‌ఫామ్‌లు నిర్వహించనున్నట్లు సమాచారం. లో ఎర్త్ ఆర్బిట్ విభాగంలో ప్రపంచస్థాయి శాటిలైట్ నెట్‌వర్క్ ఏర్పాటు చేయడమే రిలయన్స్ ప్రధాన లక్ష్యంగా భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టును స్వయంగా ముఖేష్ అంబానీ పర్యవేక్షిస్తున్నట్లు సంస్థ వర్గాలు తెలిపాయి. పీకే భట్నాగర్, మాథ్యూ ఊమెన్, ఆయుష్ భట్నాగర్ వంటి సీనియర్ అధికారులు కూడా ఈ ప్రణాళికలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు ఆరు ప్రత్యేక బృందాలను సంస్థ ఏర్పాటు చేసింది. శాటిలైట్ డిజైన్, ప్రయోగాలు, పేలోడ్ టెక్నాలజీ, వినియోగదారుల టెర్మినల్స్ వంటి విభాగాలపై ఈ బృందాలు పనిచేస్తున్నాయి. వచ్చే రెండు నుంచి నాలుగు సంవత్సరాల్లో సొంత లో ఎర్త్ ఆర్బిట్ శాటిలైట్లను కక్ష్యలోకి ప్రవేశపెట్టాలనే లక్ష్యంతో సంస్థ ముందుకు సాగుతోంది. ఈ ప్రాజెక్టు కోసం విదేశీ శాటిలైట్ సాంకేతిక సంస్థలతో కూడా చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం. అవసరమైతే ఇప్పటికే శాటిలైట్ నెట్‌వర్క్‌లు కలిగిన విదేశీ సంస్థలను కొనుగోలు చేసే అవకాశాలను కూడా రిలయన్స్ పరిశీలిస్తోంది. భారతదేశానికి సొంత శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థ అవసరమనే అభిప్రాయం కేంద్ర ప్రభుత్వంలో కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా డేటా భద్రత, డిజిటల్ సార్వభౌమత్వం పరంగా స్వదేశీ శాటిలైట్ నెట్‌వర్క్ కీలకమని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్బిట్ స్లాట్లు, రేడియో ఫ్రీక్వెన్సీల కేటాయింపుల కోసం జియో ఇప్పటికే టెలికాం శాఖను సంప్రదించినట్లు సమాచారం. ప్రస్తుతం జియోకు ఎస్ఈఎస్ సంస్థతో భాగస్వామ్యం ఉన్నప్పటికీ, అది మధ్యస్థ భూమి కక్ష్య సేవలకే పరిమితమై ఉంది. ఇప్పుడు పూర్తిస్థాయి లో ఎర్త్ ఆర్బిట్ శాటిలైట్ ఇంటర్నెట్ రంగంలోకి అడుగుపెట్టడం ద్వారా భారతదేశం గ్లోబల్ డిజిటల్ కమ్యూనికేషన్ రంగంలో మరింత బలపడే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# ఎయిర్ ఇండియాలో ఖర్చుల నియంత్రణ

**న్యూఢిల్లీ, మే 9 :** టాటా గ్రూప్‌కు చెందిన దేశీయ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా వ్యయ నియంత్రణ చర్యల దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. పెరుగుతున్న నిర్వహణ వ్యయాలు, అంతర్జాతీయ సంక్షోభాల ప్రభావంతో సంస్థ కఠిన పరిస్థితులను ఎదుర్కొంటోందని యాజమాన్యం ఉద్యోగులకు స్పష్టం చేసింది. సంస్థలో అనవసర ఖర్చులను పూర్తిగా తగ్గించాలని, వీలైనంత పొదుపు పాటించాలని ఎయిర్ ఇండియా సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ ఉద్యోగులకు సూచించినట్లు సమాచారం. అయితే ప్రస్తుతం ఉద్యోగాల తొలగింపులు ఉండవని, కానీ వార్షిక వేతనాల పెంపును కనీసం మూడు నెలలపాటు వాయిదా వేయాల్సి వస్తుందని సంస్థ తెలిపినట్లు తెలుస్తోంది. సంస్థ సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్, ఆర్థిక విభాగాధిపతి సంజయ్ శర్మ, మానవ వనరుల విభాగాధిపతి రవీంద్ర కుమార్ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఈ విషయాలను వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వేరియబుల్ పే, ఇప్పటికే నిర్ణయించిన ప్రమోషన్లు అమల్లోకి వస్తాయని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అదనపు ఆర్థిక భారం తగ్గించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ విమానయాన రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్–ఇరాన్ ఘర్షణల కారణంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో విమాన ఇంధన ధరలు రెండు నుంచి మూడు రెట్లు పెరిగాయి. మరోవైపు గల్ఫ్ దేశాల గగనతల ఆంక్షలు భారతీయ విమానయాన సంస్థలకు అదనపు భారంగా మారాయి. పాకిస్థాన్ గగనతలాన్ని ఇప్పటికే వినియోగించలేకపోతున్న భారతీయ విమానయాన సంస్థలకు, గల్ఫ్ ప్రాంత పరిమితులు మరింత ఇబ్బందులను తెచ్చిపెట్టాయి. ముఖ్యంగా యూఏఈ, ఖతార్, కువైట్, సౌదీ అరేబియా, బహ్రెయిన్ ప్రాంతాలకు వెళ్లే విమాన సర్వీసులపై ప్రభావం పడింది. అంతర్జాతీయ మారకద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ పడిపోవడం కూడా విమానయాన సంస్థల వ్యయాలను పెంచుతోంది. విదేశీ విమానాశ్రయ సేవలు, సిబ్బంది చెల్లింపులు డాలర్లలోనే జరగడంతో ఖర్చులు మరింత పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో నష్టాలు వస్తున్న మార్గాల్లో విమాన సర్వీసులను తగ్గించడం లేదా తాత్కాలికంగా నిలిపివేయడం గురించి కూడా ఎయిర్ ఇండియా ఆలోచిస్తున్నట్లు సమాచారం. జూన్, జూలై నెలల్లో కొన్ని సర్వీసుల సంఖ్య తగ్గే అవకాశం ఉందని సంస్థ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఎయిర్ ఇండియా దాదాపు 190 విమానాలను నడుపుతూ వారానికి సుమారు 8 వేల సర్వీసులు నిర్వహిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో సుమారు 6.2 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చింది. 2022లో కేంద్ర ప్రభుత్వం నుంచి టాటా గ్రూప్ ఎయిర్ ఇండియాను స్వాధీనం చేసుకున్న తర్వాత సంస్థ ఆదాయం గణనీయంగా పెరిగినా, గత ఆర్థిక సంవత్సరంలో రూ.22 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనాలు వ్యక్తమవుతున్నాయి. అహ్మదాబాద్ విమాన ప్రమాదం వంటి ఘటనలు కూడా సంస్థపై ప్రతికూల ప్రభావం చూపినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

